నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
గురువారం | 21 డిసెంబర్ 2023 | www.navatelangana.com

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

నర్సాపూర్‌లో ఆటో డ్రైవర్ల ధర్నా



నవ తెలంగాణ నర్సాపూర్

ఆటోనే ఉపాధిగా నమ్ముకొని కుటుంబాలను పోషిస్తున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు అన్నారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నర్సాపూర్ పటణంలో 100 ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. నర్సాపూర్ చౌరస్తాలో ఆటోలతో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు మాట్లాడుతూ మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో అనేక మంది ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లను గుర్తించి వారి ఇబ్బందులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పెద్ద ఎత్తున సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు ఆంజనేయులు, నాగభూషణం, రాజు,భిక్షపతి, కుమార్, లక్ష్మణ గౌడ్, ఖదీర్, సత్యనారాయణ, నందు, రాములు, మహేష్, మునీర్, రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఫోన్ అప్పగింత



నవతెలంగాణ-చేర్యాల

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్ స్వాధీనం చేసుకుని బాధితునికి బుధవారం చేర్యాల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఒడ్డాటి దామోదర్ అప్పగించారు. ఎస్ఐ దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం... పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకునూరు గ్రామానికి చెందిన జాల సంజీవరెడ్డి మొబైల్ ఫోన్‌ను జూలై 28న పోగొట్టుకున్నాడు. ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన %ఞఞ.ఎవఱతీ.స్త్రశీఙ.ఱఅ% అనే వెబ్సైట్ లో ఫోన్ ఐఎంఈఐ నెంబర్ ఎంటర్ చేసి బ్లాక్ చేశాడు. వెంటనే ఫోన్ దొరికిన వ్యక్తి దానిలో సిమ్ కార్డు వేసుకోవడంతో ఈ వెబ్సైట్ ద్వారా అతని వివరాలతో కూడిన సమాచారం పోలీసులకు చేరింది. పోలీసులు ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకుని పోగొట్టుకున్న వ్యక్తికి చేర్యాల పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌రావుతో కలిసి ఎస్ఐ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌ను నేరుగా బ్లాక్ చేయవచ్చని, తద్వారా కోల్పోయిన ఫోన్‌ను తొందరగా పొందుతారని తెలిపారు.

కరోనా కలవరం



- కొత్త వేరియంట్ జెఎన్-1 వ్యాప్తి
- హైదరాబాద్‌లో పాజిటివ్ కేసుల నమోదు
- చలి తీవ్రత ఉన్నందున వ్యాప్తికి అవకాశాలు
- వేరియంట్‌ను ఎదుర్కొనేందుకు వైద్య ఆరోగ్య శాఖ సిద్ధం
- ప్రజలు జాగ్రతలు తీసుకోవాలని సూచన
- మాస్క్ వాడకం అనివార్యమంటున్న నిపుణులు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కరోనా కలవరం మళ్లీ మొదలైంది. రెండేళ్లుగా ప్రశాంతంగా ఉన్న ప్రజల్లో కరోనా కొత్త వేరియంట్ జెఎన్-1 అలజడి సృష్టిస్తోంది. కేరళ, తమిళనాడు, హైదరాబాద్‌లోనూ వ్యాప్తిస్తుండడంతో ప్రజల్లో కరోనా కాలం నాటి అప్రమత్తత అనివార్యమైంది. చలి తీవ్రంగా ఉన్నందున వైరస్ వ్యాప్తి చెందే అవకాశాలెక్కవగా ఉంటాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. కరోనా వైరస్‌ను ఆదిలోనే అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్రం అప్రమత్తం చేస్తుంది. హైదరాబాద్‌లో కరోనా కేసులు నమోదైనందున పక్కనే ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రజలు జాగ్రతలు తీసుకోక తప్పదు.

చలి తీవ్రత.. వాతావరణ మార్పులు

వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. కొంత కాలంగా చలి తీవ్రత పెరిగింది. ఒక పక్క చలి పెరగడం, వాతావరణంలో మార్పులు రావడంతో సీజనల్‌గా వచ్చే వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇప్పటికే దగ్గు, సర్ది, జ్వరం వంటి వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రులన్నీ రోగులతో నిండిపోయాయి. టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలతో పాటు శ్వాశకోశ వ్యాధులు ప్రబలుతుండడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రత కూడా పెరుగుతోంది. పగటి పూట ఎండ కాచినా చలిగాలులు వీస్తుండడంతో పగటి పూట కూడా రాత్రి మాదిరే చలి పెడుతుంది. పిల్లలు, వృద్దులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఈ సీజన్‌లో ఇబ్బందులు పడుతున్నారు. ఇదే సీజన్‌లో కరోనా ఇబ్బందులు కూడా వస్తే ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. కరోనా కొత్త వేరియంట్ జెఎల్-1 వ్యాప్తి చెందకుండా జాగ్రతలు తీసుకోవాలి. అందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సీజనల్ వ్యాధుల్లో ముఖ్యంగా శ్వాశకోశ వ్యాధులు ఇబ్బందికరంగా మారుతున్నాయి. ఎందుకంటే కరోనా కొత్త వేరియంట్ జెఎల్-1 కూడా శ్వాశ కోశ ఇబ్బందుల్ని కల్గించే అవకాశముందంటున్నారు. కరోనా మూడు వేవ్‌ల్లో కరోనా సోకిన వాళ్లకు కూడా ఈ కొత్త వేరియంట్ ప్రభావం చూపే అవకాశముందంటున్నారు.

ప్రజారోగ్య ప్రమాదం తక్కువే

కోవిడ్-19 కొత్త వేరియంట్ జెఎన్-1 ఆసక్తి వేరియంట్‌గా వర్గీకరించి దీని వల్ల ప్రజారోగ్యానికి పెద్దగా ముప్పు వాటిల్లదని వైద్య నిపుణులు స్పష్టం చేశారు. ఇప్పటికే కోవిడ్ జెఎన్-1 యొక్క కొత్త ఉప వేరియంట్ వల్ల కలిగే ప్రజారోగ్య ప్రమాదం తక్కువగా ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న వ్యాక్సిన్‌లు జెఎన్-1 కోవిడ్-19 వైరస్ మొక్క ఇతర వేరియంట్ల వల్ల సంభవించే వ్యాధి వ్యాప్తి మరణాల నుంచి రక్షణ కల్పిస్తాయని డబ్ల్యూహెచ్ఓ వెల్లడించింది.

అప్రమత్తత ప్రకటించిన ప్రభుత్వం

ఇతర రాష్ట్రాలతో పాటు తెలంగాణలోనూ కరోనా కేసులు పెరుగుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గాంధీ ఆసుపత్రిలో కరోనా కొత్త వేరియంట్ జెఎన్-1 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో ప్రజలు తప్పకుండా మాస్క్ ధరించాలని ఆదేశాలు జారీ చేసింది. మాస్క్ ధరించకపోతే వైరస్ వ్యాప్తి చెందే ప్రమాదమున్నందున తప్పని సరిగా పాటించాలని సూచిస్తున్నారు. కరోనా కొత్త వేరియంట జెఎన్-1తో జాగ్రతగా ఉండాలని చెబుతోంది. కరోనా కేసులు నమోదు కాకుండా ఉండేందుకు తగిన జాగ్రతలు, చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. గతంలో కోవిడ్-19 మూడు వేవ్‌ల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తొలి రెండు వేవ్‌లో మరణాల సంఖ్య విపరీతంగా ఉన్నందున కొత్త వేరియంట్ సమయంలో తగిన జాగ్రతలు తీసుకోవాల్సి ఉంటుంది.

చలి తీవ్రత.. తస్మా జాగ్రత

కోవిడ్-19 తర్వాత కొత్త వేరియంట్ జెఎన్-1 వ్యాప్తి చెందుతున్న వేళ చలి తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రతలు తీసుకోవాలని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. కరోనా కొత్త ఉప వేరియంట్ లక్షణాల్లో జ్వరం, గొంతు నొప్పి, తలనొప్పి కనిపిస్తాయని వైద్యులు నిర్ధారించారు. కొందరిలో శ్వాస సంబంధిత సమస్యలు వచ్చాయంటున్నారు. నాలుగైదు రోజుల పాటు ఈ లక్షణాలు కనిపిస్తాయంటున్నారు. రద్దీగి ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లే సమయంలో విధిగా మాస్క్ ధరించాలని సూచిస్తున్నారు. మిగతా వైరల్ ఇన్‌ఫెక్షన్లలోనూ ఇవే లక్షణాలు కలినిపిస్తున్నాయి. కొత్త వేవ్ వస్తుందని భయపడాల్సిన అవసరంలేదని వైద్య నిపుణులు డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. పరిశుభ్రత పాటించడం, సోషల్ డిస్టెన్స్, మాస్కులు ధరించడం లాంటి జాగ్రతలు తీసుకోవాలంటుఅన్నరు. శ్వాస సంబంధిత సమస్య అధికమైతే కోవిడ్ టెస్టులు చేయించుకోవడం మంచిదని సూచిస్తున్నారు. గొంతు నొప్పి మొదలైనట్లుగా ఉంటే గోరువెచ్చని నీటిని తాగాలని వైద్యులు చెబుతున్నారు.

క్రిస్మస్, కొత్త సంవత్సర వేడుకలు

కరోనా కొత్త వేరియంట్ వ్యాపిస్తున్న సమయంలో తగిన జాగ్రతలు తీసుకోవాల్సిన అవసరముందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ నెల 25న క్రిస్మస్ పండగ ఉన్నందున మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారు. అదే విధంగా నూతన సంవత్సరం సందర్భంగా ఈ నెల 31న వేడుకలు జరుపుకునేందుకు సిద్దమవుతున్నారు. ఈ రెండు వేడుకల సందర్భంగా ప్రజలు సమూహంగా పాల్గొనే వేడుకల్లో జాగ్రతలు తీసుకోవాలని చెబుతున్నారు. మెదక్ చర్చితో పాటు అనేక చర్చీల్లో క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటారు. తప్పని సరిగా మాస్కులు ధరిస్తే మంచిందంటున్నారు. న్యూ ఇయర్ వేడుకల్లోనూ జాగ్రతలు తప్పవని పోలీసులు పేర్కొంటున్నారు. హైదరాబాద్, ఇతర రాష్ట్రాలకు ప్రయాణాలు కొనసాగించే వాళ్లు సైతం తగిన జాగ్రతలు తీసుకోవాలి.

పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేయాలి

రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్



నవతెలంగాణ - మెదక్

రానున్న పార్లమెంట్ ఎన్ని కలకు ఓటర్ జాబితా తయా రీతో పాటు ఎన్నికల పకడ్బందీ నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల అధి కారి వికాస్ రాజ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి హైద రాబాద్ సిఈఓ కార్యాలయము నుండి జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్ఓ పద్మశ్రీ, మెదక్, నర్సాపూర్ ఆర్డీఓలు రాజేశ్వర్, శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ కొద్ది రోజుల్లో పార్లమెంటు ఎన్నికలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్లమెంటు ఎన్నికలకు ఓటర్ల జాబితా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న వారందరు ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, మార్పులు చేర్పులు చిరునామా మారిన వారు చేసుకున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జాబితాలో తప్పులు లేకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగ సూపరింటెంట్ హర్దిప్ సింగ్, మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రైతుల బాధలు బిగ్‌బాస్ దృష్టికి తీసుకెళ్లడం అభినందనీయం



నవతెలంగాణ-తొగుట

రైతుల బాధలను బిగ్‌బాస్ దృష్టికి తీసుకెళ్లిన పల్లవిప్రశాంత్ లక్ష్యం అభినందనీయమని సర్పంచ్ బిక్కనూరి రజిత శ్రీశైలం యాదవ్ అన్నారు. బుధవారం గజ్వేల్ మండలం కొల్గూర్ గ్రామంలో పల్లవి ప్రశాంత్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామలల్లో రైతుల గోడును రాష్ట్ర వ్యాప్తంగా బిగ్‌బాస్ 7 ద్వారా తెలియజేయడం అభినందనీయమన్నారు. ఆరు గాలం కష్ట పడుతున్న రైతు బాధలను వివరించడానికి కృషి చేయడం గొప్ప విషయమన్నారు.

లక్ష్యాన్ని ఎంచుకొని గమ్యం చేరాలి

తమిళనాడు ఐజీపీ అభినపు ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-చేర్యాల

ప్రతి ఒక్క వ్యక్తి లక్ష్యాన్ని ఎంచుకొని గమ్యం చేరేవరకు విశ్రమించొద్దని తమిళనాడు ఐజీపీగా విధులు నిర్వహిస్తున్న చేర్యాల మండలం నాగపురి గ్రామానికి చెందిన అభినపు ప్రవీణ్ కుమార్ విద్యార్థులకు సూచించారు. నాగపురి గ్రామంలో చదువుకున్న పాఠశాలను బుధవారం సందర్శించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేస్తూ ఈ పాఠశాలలో ఏడో తరగతి వరకు చదివి బండారుపల్లిలోని రెసిడెన్షియల్ పాఠశాలలో 8వ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుకున్నానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈ స్థాయికి ఎలా ఎదిగారో తన అనుభవాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు కష్టపడడమే కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.తాను చదివిన పాఠశాలను ప్రతి సంవత్సరం సందర్శిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్‌ను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎలికట్టే ఐలయ్య,ఎంపీపీ కరుణాకర్, సర్పంచ్ బండమీది సంతోషి- కరుణాకర్, ఉప సర్పంచ్ ప్రజ్ఞాపురం ఎల్లేష్, ఎస్ఎంసి చైర్మన్ ప్రజ్ఞాపూర్ నరసింహులు, గ్రామస్తులు గాండ్ల రాజు, గూడెపు మహేష్, జక్కుల తిరుపతి, తుమ్మ వెంకటేష్, జనార్ధన్, మహేందర్, ఉపాధ్యాయులు ఎస్ కృష్ణమూర్తి, ఏ లక్ష్మణ్, సిహెచ్ శ్రీశైలం, ఎస్ నిరూపమా, టీ.మనోజ్ కుమార్, కే వేణుగోపాల్, కే మాధవి, బి సునీత భాయ్, ఎం. శ్రీనివాస్, ఎండి. ఉమర్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేతకీ హుండీ ఆదాయం రూ.36.92 లక్షలు



నవతెలంగాణ - ఝరాసంగం

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం హుండీ ఆదారం లెక్కించారు. శ్రీ రాజరాజేశ్వరి ఆలయం నుండి మహిళలు హుండీ లెక్కింపులో దాదాపు 70 మంది మహిళలు పాల్గొన్నారు. భక్తులు వివిధ మొక్కులను చెల్లించి కానుకల రూపంలో హుండీలలో వేసిన ఆదాయాన్ని ఉదయం నుండి సాయంత్రం వరకు లెక్కించారు. హుండీ ఆదాయం 36 లక్షల 92 వేల 873 రూపాయలు వచ్చినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

23న వైకుంఠద్వార దర్శనం

నవతెలంగాణ-నంగునూరు

మండల కేంద్రమైన నంగునూరులోని కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 23న వైకుంఠద్వార దర్శన మహెూత్సవం నిర్వహించనున్నట్లు మంగువారి ధార్మిక సంస్థ చైర్మన్ మంగు రాధాకిషన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, ఆపదమొక్కులవాడు, కలియుగ ప్రత్యక్ష దైవము వెంకటేశ్వర స్వామి 24-12-2004 నంగునూరులో ప్రతిష్ఠింపబడిందన్నారు. గత 20 సం?లుగా వైభవోపేతముగా బ్రహ్మోత్సవములు, వార్షికోత్సవములు జరుపుకొనుచున్నా మన్నారు. భక్తుల పాలిట పెన్నిధిగా కోరికలు తీర్చుచున్న విషయము అందరికి తెలిసిందేనని చెప్పారు. మాసములన్నింటిలో పవిత్రమైన ఈ ధనుర్మాసములో ఆ అనంతశయనుని దర్శించినా, సేవించినా ఎంతయో పుణ్యఫలము లభిస్తుందన్నారు. ఈ ధనుర్మాసములో వచ్చు వైకుంఠ ఏకాదశి నాడు ఆ వైకుంఠపతి అయిన శ్రీ కళ్యాణ వేంకటేశ్వరా స్వామి వారిని వైకుంఠ ద్వారము ద్వారా ప్రవేశించి దర్శించి సేవించినచో సకల సౌభాగ్యాలు చేకూరునని తెలిపారు.ఈ నెల 23న శనివారము మార్గశిర శు? ఏకాదశి రోజున భక్తుల దర్శనార్థమై వంగునూరులో కళ్యాణ వేంకటేశ్వర స్వామి' వారి సన్నిధిలో గల వైకుంఠ ద్వారము భక్తుల దర్శనార్థమై 5 గంటలకు బ్రాహ్మణోత్తముల వేదపఠనం తో ప్రారంభిస్తామన్నారు. వైకుంఠ ద్వా రం ద్వారా ప్రవేశించి ఆ శ్రీమన్నారాయణున్ని దర్శించి, సేవించి, స్వామివారి అనుగ్రహం పొందాలని ఈ సందర్భంగా వారు కోరారు.

ఆదర్శ పాఠశాలలో మత ప్రచారం

- అడ్డుకున్న స్థానికులు
- - ప్రిన్సిపాల్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలి





నవ తెలంగాణ పుల్కల్

ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు క్రిస్టియన్ మత బోధ చేయడానికి ప్రిన్సిపాల్ జ్యోతి హెబ్సిబా అనుమతించడంతో స్థానికులు, భజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకులు సుభాష్‌చందర్ అడ్డుకున్న సంఘటన బుధవారం జరిగింది. ఈ నెల 26న జరిగే క్రిస్టమస్ వేడుకల గురించి విద్యార్థులకు చెప్పడాన్ని ఆయన తప్పుపట్టారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి హెబ్సిబాను నిలదీశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మత బోధ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆదర్శ ప్రిన్సిపాల్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

స్వీయ అనుభవం అవశ్యం





నవ తెలంగాణ - పటాన్‌చెరు

ప్రయోగశాలలో ఎలుకలు, కుందేళ్లు వంటి చిన్న జంతువుల నిర్వహణ, వాటితో వ్యవహరించే తీరుపై ఫార్మసీ విద్యార్థులకు స్వీయ అనుభవం అత్యంత అవశ్యకమని హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ డాక్టర్ ప్రకాష్, బాబు అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ఆధ్వర్యంలో బయో మెడికల్ పరిశోధనలో ఉపయోగించే చిన్న జంతువులను నిర్వహణ ప్రాథమిక పద్ధతులపై అవగాహన కల్పించడం కోసం నిర్వహిస్తున్న రెండు రోజుల కార్యశాలను బుధవారం ముఖ్య అతిథిగా ఆయన జ్యోతి ప్రజ్వలనతో లాంఛనంగా ఆరంభించారు. ఈ సందర్భంగా 'క్యాన్సర్ చికిత్స కోసం ఔషధ ఆవిష్కరణలో ఆధునిక పోకడలు' అనే అంశంపై ప్రసంగించారు. వ్యక్తిగత జన్యుపరమైన వ్యత్యాసాలకు అనుగుణంగా ఆయా రోగులను బట్టి చికిత్సను చేయాల్సి ఉంటుందని డాక్టర్ బాబు పేరొన్నారు.జాతీయ పౌష్టికాహార సంస్థ (ఎన్ఐఎన్) యానిమల్ ఫెసిలిటీ పూర్వ సీనియర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎన్.హరిశంకర్ వివిధ జంతు జాతుల (ముఖ్యంగా ఎలుకలు, కుందేళ్లు, మేక పిల్లలు, కుక్కలు, కోతులు) వివరణ, నిర్వహణలను విశదీకరించారు. సీసీఎంబీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.జె. మహేష్ కునూర్, ఔషధ ప్రయోగాల కోసం జంతు నమూనాలను రూపొందించడం, జంతువుల ధోరణి, శస్త్రచికిత్సా విధానాలను వివరించారు. ఈ కార్యశాలలో పాల్గొన్న విద్యార్థులకు జంతువులను నిర్వహణ ప్రాథమిక పద్ధతులపై అవగాహన కల్పించారు.తొలుత, శివభక్తి గీతంతో ప్రారంభమైన ఈ కార్యశాలలో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ స్వాగతోపన్యాసం చేశారు. ఈ రెండు రోజుల వర్క్ షాప్2 సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. బయోమెడికల్ పరిశోధన రంగంలో విద్యార్థులు రాణించడానికి అవసరమైన అనుభవాన్ని ఈ కార్యశాల ద్వారా అందిస్తున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ విన్యాస్ మయాస పేర్కొన్నారు. ఫార్మసీ విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు అలరించాయి.

మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూలు చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



నవ తెలంగాణ సిద్దిపేట కలెక్టరేట్

జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో భాగంగా జిల్లాలోని మున్సిపాలిటీలలో ఆస్తి పన్ను వసూళ్లపై జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల మున్సిపాలిటీ కమిషనర్లు, మున్సిపల్ అధికార వర్గాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో నిర్మాణ దశలో ఉన్న పలు భవనాల నిర్మాణం, పురోభివృద్ధిపై ఆరా తీశారు. పెండింగులో ఉన్న పలు భవనాల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ప్రతి మున్సిపల్ కమిషనర్ ఆయా మున్సిపాలిటీ పరిధిలోని వార్డులో పర్యటించి చెత్త సేకరణ, డంపింగ్ యార్డు గురించి ఎప్పటి కప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారికి భారీ జరిమానాలు విధించాలని కమిషనర్లకు సూచించారు. పెండింగులోని వైకుంఠ ధామాల పనులు వెంటనే చేపట్టాలని, జిల్లాలో వచ్చే వాన కాలం నాటికి హరిత హారం కార్యక్రమానికి సంబంధించి నర్సరీలలో మొక్కల పెంపకం జరపాలని, ఇప్పటికే అన్ని మున్సిపాలిటీలకు బ్యాగులను అందజేసినట్లు, ఆ బ్యాగులలో మట్టిని నింపే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని కమిషనర్లకు ఆదేశించారు. నర్సరీలలో మొక్కలకు సంబంధించి గుల్మోరర్, గన్నేరు, టేకోమా, రెయిన్ పిస్ లాంటి విత్తనాలను బ్యాగులలో పెట్టే ప్రక్రియ సైతం వేగంగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలోని అన్నీ మున్సిపాలిటీలలో పనులన్నీ లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల మున్సిపల్ కమిషనర్లు సంపత్ కుమార్, విద్యాధర్, గణేశ్, రాజశేఖర్, రాజేంద్రకుమార్, మెప్మా పీడీ హనుమంత్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్లు, రెవెన్యూ ఆఫీసర్లు, డిటిసిపిఓ వందన తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

నవతెలంగాణ - నిజాంపేట

విద్యుత్ షాకుతో యువ రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నందిగామ గ్రామంలో చోటుచేసుకుంది వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని నందిగామ గ్రామానికి చెందిన యువరైతు రాగుల శ్రీహరి(30) తన పొలంలో తుకానికి నీరు పెట్టడానికి సాయంత్రం వెళ్లాడు. అక్కడ కొబ్బెర చెట్టుకు 11 కె.వి వైరు ఆనుకొని ఉంది. దీన్ని గమనించక శ్రీహరి తాకడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య కళ్యాణి, కొడుకు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కలిసికట్టుగా పని చేయాలి

నవతెలంగాణ-తొగుట

గ్రామాల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పని చేయాలని ఎంపీపీ గాంధారి లత నరేందర్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి బుధవారం భూమి పూజ చేశారు. ప్రహరీ కోసం 15 ఫైనాన్స్ నిధులు రూ.5 లక్షలు, సీసీ నిర్మాణం కోసం రూ.2 లక్షలు, కమాన్ ఏర్పాటు కోసం రూ.2 లక్షలు మంజూరు చేశామన్నారు. మండలంలో సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాగాల కొండల్ రెడ్డి,తొగుట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి,ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీటీసీ వేల్పుల స్వామి,టీపీసీసీ ఫిషర్మెన్ కాంగ్రె స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపాక తిరుపతి ముది రాజ్,నాయకులు సుతారి రమేష్ ఉన్నారు.



కార్యకర్తలకు అండగా ఉంటా

నవతెలంగాణ చిలిపిచేడ్

మండల పరిధిలోని రాందాస్‌గూడ గ్రామంలో మూడు రోజుల క్రితం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య గొడవకు బీఆర్ఎస్ సర్పంచ్ కారణమని, సర్పంచ్ దౌర్జన్యానికి రాందాస్ గూడ ఘటన నిదర్శనమని టీపీసీసీ రాష్ట్ర నాయకులు ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అన్నారు. టీపీసీసీ రాష్ట్ర నాయకులు ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ బుధవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలకు నాయకులకు ఎల్లప్పుడూ అందుబాటులో నిలుస్తామన్నారు. మండల పరిధిలోని బద్రయతండా సర్పంచ్ బుజ్జి బాయ్ భర్త సర్వన్ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమన్న గారి రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణ రెడ్డి,ఉపాధ్యక్షుడు పా%శీ%దరి, శ్రీనివాస్ రెడ్డి, పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సుభాష్ రెడ్డి, దిలీప్ రెడ్డి, బెస్త సుధాకర్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
సంగారెడ్డి
గురువారం | 21 డిసెంబర్ 2023 | www.navatelangana.com

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట అయ్యప్ప ఆలయంలో అందోల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఆకుల రాంబాబు కూతురు చండిక పుట్టినరోజు సందర్భంగా అయ్యప్ప స్వాములకు బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అయ్యప్ప స్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం అనంతరం అయ్యప్ప స్వాముల ఆశీస్సులను పొందారు.



ఘనంగా సెమి క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం మున్సిపల్ పరిధిలోని మల్లన్న బస్తీలో సెమీ క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మన్ అంతిరెడ్డిగారి అనిల్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్ వేణుపాల్ రెడ్డి, యువత నాయకులు ప్రవీణ్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో కలిసి సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కుల మతాలకు అతీతంగా పండుగను జరుపుకోవాలన్నారు. ఏసుప్రభు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనం తరం నాయకులని నిర్వాహకులు ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రభు , పాస్టర్ జోబాబు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మారిన సంత.. తీరిన చింత

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో గతంలో నిర్వహించిన చోటుకే సంతను తరలించడంతో జిన్నారం గ్రామపంచాయతీ పరిధి గ్రామాలు, వ్యాపారస్తులు సంతోషం వ్యక్తం చేశారు. జిన్నారం నడిబొడ్డులోని గాంధీ విగ్రహ స్థలాన్ని కేంద్రంగా చేసుకొని ఇటు అంగడి బజార్ వరకు గ్రామంలోని ప్రధాన దారులను కలుపుతూ తిరిగి సంతను బుధవారం నిర్వహించారు. దాంతో వ్యాపారస్తులతో పాటు ప్రధానంగా మహిళలు, గృహిణులు తమకు సౌకర్యవంతంగా ఉందంటూ అభిప్రాయపడ్డారు. పాత స్థలంలోని సంతను తిరిగి ఏర్పాటు చేసినందుకు జిన్నారం గ్రామపంచాయతీ పరిధి గ్రామస్తులు.. అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



కాసాలలో ఘనంగా సెమీ క్రిస్టమస్

నవతెలంగాణ-హత్నూర

మండల పరిధిలోని కాసాల గ్రామంలో దక్షిణ ఇండియా సంఘం (సీఎస్ఐ) ఆధ్వర్యంలో బుధవారం సెమీ క్రిస్టమస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతీ కుటుంబాన్ని సందర్శించి సంఘ కాపరి రెవరెండ్ ప్రెస్ బీటర్ ఇంచార్జ్ సురేష్ గురువులు మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు ఎప్పుడు ప్రేమ, కరుణ, క్షేమా హృదయం కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా సంగీత వాయిద్యాలతో క్రీస్తు జయంతి పాటలు పాడుతూ.. జయంతి ఉత్సవాలను ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ కమిటీ మెంబర్లు ప్రభాకర్, సుభాష్, పాముల భాస్కర్, లోకల్ స్టువర్డ్ సాగర్, లక్ష్మణ్, దావీద్ తదితరులు పాల్గొన్నారు.



కంగ్టి మండల టీఎస్‌యూటీఎఫ్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కంగ్టి

-మండల కేంద్రమైన కంగ్టిలో బుధవారం టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీని రాష్ట్ర కమిటీ సభ్యులు కాశీనాథ్ జాదవ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా స్వామి, ఉపాధ్యక్షులుగా జైపాల్, జగదేవి, కోశాధికారీగా ప్రభాకర్, ఆడిటర్‌గా మంజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాశీనాథ్ జాదవ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని, జీ.ఓ నంబర్ 317 బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దుచేసి పీఆర్సీని ప్రకటించాలన్నారు. ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి హరిషింగ్, ఖేడ్ మండల కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.



తొమ్మిదో రోజు మున్సిపల్ కార్మికుల నిరసన

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆ శాఖ కార్మికులు చేపట్టిన నిరసన బుధవారానికి తొమ్మిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా నిరసనలో పాల్గొని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్.చిరంజీవి మాట్లాడుతూ.. 82 మంది మున్సిపల్ వర్కర్లు ఉండగా.. వారిలో ఇద్దరికి మాత్రమే వేతనాలు పెంచారన్నారు. మిగతా 80 మందికి వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ.. గత తొమ్మిది రోజులుగా కార్మికులు నిరసన చేపడుతున్నారన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి.. కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. లేని యెడల సమ్మెకు కూడా సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ నిరసనలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు సాయిలు, కుమార్, నారాయణ, సిద్ధమ్మ, చంద్రకళ, శకుంతల, రవి, పవన్, రాజు, యేసు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దామోదర్‌తోనే అందోల్ అభివృద్ధి

నవతెలంగాణ-పుల్కల్



అందోల్ నియోజకవర్గం అభివృద్ధి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహతోనే సాధ్యమని పార్టీ చౌటాకుర్ మండల మండల అధ్యక్షులు నత్తి దశరథ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేండ్లు బీఆర్ ఎస్ ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాల కోసమే పరిపాలన సాగించారన్నారు. ఎన్ని సంక్షేమ పథకాలు పెట్టినా.. అవి కేవలం ఆ పార్టీ కార్యకర్తలకు మాత్రమే అందాయని ఆరోపించారు. దళితుల మూడెక రాల భూమి, కేజీ టు పీజీ ఉచిత విద్య హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రాజె క్టుల పేరుతో వేలకోట్ల రూపాయలు కమిషన్లు తీసుకున్నారని ఆరోపించా రు. కానీ తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి తీరుతుందన్నారు. గెలుపును ఓర్వలేక కొందరు కావాలనే తమ నేత దామోదర్‌పై విమర్శలు చేస్తున్నారని.. ఇది సరికాదన్నారు. ఏది ఏమైనా అందోల్ అభివృద్ధి మాత్రం దామోదర రాజనర్సింహాతోనే సాధ్యమన్నారు.

కేవైసీ తిప్పలు..



- అధికారంలోకి వస్తే రూ.500కే గ్యాస్ ఇస్తామని కాంగ్రెస్ హామీ
- ప్రభుత్వం ఏర్పడంతో 'ఆశ'లో ప్రజలు
- ఈ నేపథ్యంలో గ్యాస్ కేవైసీ చేసుకోవాలని ప్రచారం
- వారం రోజులుగా ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్న జనం
- ఎముకలు కొరికే చలిలోనూ నిరీక్షణ
- పనిచేయని బుకింగ్ నెంబర్లు

నవతెలంగాణ-జహీరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే రూ.500కే గ్యాస్ ఇస్తామని గ్యారెంటీ పథకాల్లో ప్రకటించిన విషయం విధితమే. కాగా ప్రభుత్వం ఏర్పాటవడంతో.. ఎప్పుడెప్పుడు రూ.500కే గ్యాస్ ఇస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్యాస్ కేవైసీ చేసుకోవాలని విస్తృత ప్రచారం మొదలైంది. ఇంకేముంది గత వారం రోజులుగా ఏ గ్యాస్ ఏజెన్సీ చూసినా వినియోగదారులతో కిక్కిరిసి కనిపిస్తోంది. చిన్నా పెద్దా తేడా లేకుండా వృద్ధులు సైతం ఉదయాన్నే ఏజెన్సీ ఎదుట క్యూలో నిల్చుంటున్నారు. ఎముకలు కొరికే చలిలోను వందలాది మంది లైన్లలో నిలబడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్యాస్ షార్టేజ్ ఉన్నదని చెబుతూ.. ఏజెన్సీ నిర్వాహకులు బుకింగ్ నెంబర్లను కూడా వినియోగంలో నుంచి తీసేశారు. దాంతో ఈ రద్దీ మరింత ఎక్కువైంది. ఎవరి పేరుపైనే ఉంటుందో వారు మాత్రమే వచ్చి.. కేవైసీ చేసుకోవాలని నిర్వాహకులు తెలపడంతో.. వృద్ధులు కూడా లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చింది. కాగా ప్రభుత్వం నుంచి ఏ విధమైన ఉత్తర్వులు రాకపోయినప్పటికీ.. గ్యాస్ కనెక్షన్ ఉన్నవారు కేవైసీ చేసు కోవాలని పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతోనే ఈ దుస్థితి నెలకొన్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇందుకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలిచ్చి ప్రజల ఇబ్బందులు తొలగించాలని గ్యాస్ వినియోగదారులు కోరుతున్నారు. బుకింగ్ నెంబర్లను బ్లాక్ లిస్టులో పెట్టిన ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఉదయం 8 గంటలకే వచ్చాను



గ్యాస్ కేవైసీ కోసం ఉదయం 8 గంటలకే వచ్చాను. అప్పటికే నా ముందు చాలామంది వచ్చి లైన్లలో వేచి ఉన్నారు. సాయంత్రం 4 గంటలైనా నా నెంబర్ రాలేదు. గంటల తరబడి కనీసం నీళ్లు తాగకుండా లైన్లలో నిలుచున్నాను.

\- రాములు, జాడి మల్కాపూర్

కేవైసీ పేరుతో వేధిస్తున్నారు



కేవైసీ చేసుకోవాలని ముసలోళ్లను కూడా పిలుస్తుండడంతో.. వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నేను ఉదయం ఏడు గంటలకు వచ్చిన ప్పటికీ.. సాయంత్రం రెండైనా కేవైసీకి పిలవడం లేదు. కేవైసీ కోసం నా బొటనవేలు పెడితే అది కూడా రావడం లేదు. కండ్లకు కూడా రావడం లేదు. దీంతో నాకు గ్యాస్ ఇవ్వడం లేదు. నేనేం చేయాలి.

\- లక్ష్మమ్మ, మల్చల్మ గ్రామం

టీడీఎస్ నిబంధనలపై పూర్తి అవగాహన ఉండాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఆదాయ పన్ను, టీడీఎస్ నిబంధనలపై డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే టీడీఎస్ రిటన్స్ నిర్ణీత సమయంలోగా సజావుగా సమర్పించగలగుతారని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదాయపు పన్ను శాఖ టీడీఎస్ విభాగం, హైదరాబాదు వారి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లాలోని అన్ని శాఖల డీడీఓలకు ఆదాయపు పన్ను, టీడీఎస్ నిబంధనలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఉదయం సంగారెడ్డి, ఆందోల్ డివిజన్ల డీడీఓలకు, మధ్యాహ్నం జహీరాబాద్, నారాయణ్ ఖేడ్ డివిజన్‌ల డీడీఓలకు టీడీఎస్ నిబం ధనలు, ఆదాయపు పన్ను చట్టంలోని నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆదాయ పన్ను శాఖ హైదరాబాద్ కార్యాలయ ఇన్‌కమ్‌టాక్స్ అధికారి మానస్ రంజన్ మెహర మాట్లాడుతూ.. నిర్ణీత సమయంలోగా కరెక్ట్ టీడీఎస్ రిటర్న్ సమర్పించాలన్నారు. టీడీఎస్ రిటర్న్ మొదటి క్వార్టర్‌కు సంబంధించి జులై 31 లోగా, రెండో క్వార్టర్ అక్టోబర్ 31, మూడవ క్వార్టర్ జనవరి 31, నాలుగవ క్వార్టర్ తదుపరి ఫైనాన్షియల్ ఇయర్ మే, 15లోగా సమర్పించాలన్నారు. టీడీఎస్ రిటర్న్ దాఖలు చేయడంలో సమస్యలు ఉంటే.. www.TDSCPC.GOV.IN వెబ్సైట్లో నమోదు చేసుకుని లాగిన్ అయి.. క్లారిఫికేషన్ పొందాలని సూచించారు. సంబంధిత వెబ్‌సైట్లో డిడిఓ మొబైల్ నెంబర్, ఇమెయిల్ ఐడితో రిజిస్టర్ చేసుకోవాలని, క్వార్టర్లీ టీడీఎస్ రిటర్న్ కు సంబంధించిన స్టేటస్, పెండింగ్ డిమాండ్స్‌ను అందులో వెరిఫై చేసుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఆదాయపు పన్ను, టీడీఎస్ నిబంధనలు, ఫైలింగ్ ఏ విధంగా చేయాలి, రిటర్న్ ఎప్పటిలోగా సమర్పించాలి? తదితర అంశాలపై వివరించారు. ఏవేవి సందేహాలు ఉంటే.. hyderabad.ito.tds1.4@incometax.gov.inకు ఈ మెయిల్ చేయవచ్చని సూచించారు. అదేవిధంగా టిడీఎస్ కు సంబంధించిన అన్ని సందేహాల నివృత్తికి డీడీఓలు తమ సిబ్బందిని హైదరాబాద్‌లోని ఏసీ గార్డ్స్ వద్ద గల ఇన్‌కం టాక్స్ టవర్, నాల్గో అంతస్తులోని ఇన్కమ్ టాక్స్ జాయింట్ కమిషనర్ కార్యాలయంలో ప్రతి నెల మూడో బుధవారం సాయంత్రం 3:00 గంటల నుంచి 5:00 గంటల వరకు నిర్వహించే టీడీఎస్‌పై వెబ్‌సైట్ శిక్షణకు పంపవచ్చన్నారు. సమగ్ర అవగాహనతోనే టీడీఎస్ రిటర్న్ సవ్యంగా సమర్పించవచ్చన్నారు. ఈ సందర్భంగా పలువురు డీడీఓలు తమ సందేహాలను వారి ముందు ఉంచగా నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ అధికారి కవిత, జిల్లాలోని అన్ని శాఖల డీడీవోలు, హైదరాబాద్ ఇన్కమ్ టాక్స్ కార్యాలయం అధికారి పావల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు మానుకొని.. సంక్షేమం చేయండి

నవతెలంగాణ-పుల్కల్



ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకొని.. ప్రజల సంక్షేమం గురించి పనిచేయాలని బీఆర్ఎస్ రాయపాడు గ్రామ శాఖ అధ్యక్షులు రాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 60 ఏండ్లలో చేయలేని అభివృద్ధి పనులను పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ చేసి చూయిం చిందన్నారు.రాష్ట్రంలోని అన్ని నియోజ కవర్గాలు ఎంతగానో అభివృద్ధి చెందాయన్నారు. దామోదర రాజ నర్సింహ ఇటీవలే ఎమ్మెల్యే గెలిచి.. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టి 15 రోజులవుతున్నా.. నియోజకవర్గంలో ఏ ఒక్క అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టి.. ప్రజా సంక్షేమానికి కృషి చేయాలన్నారు.

ఇండ్లు దెబ్బతిన్న బాధితులకు పరిహారం



నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గతంలో కురిసిన వర్షాలకు ఇల్లు ధ్వంసమైన 40 మంది బాధితులకు ఒక్కొక్కరికి రూ.3,200 చొప్పున మొత్తం రూ.1,28,000 మంజూరైనట్లు మండల పరిషత్ అధ్యక్షులు దమ్మగౌని రవీందర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే మండల పరిధిలోని వావిలాల, జిన్నారం, మాదారం, కొడకంచి, ఊట్ల, లక్ష్మీపతిగూడెం తదితర గ్రామాలతోపాటు వర్షానికి ఇల్లు నష్టపోయిన వారికి పరిహారం చెల్లిస్తామన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేలా చర్యలు

మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ సుష్మశ్రీ వేణుగోపాల్ రెడ్డి



నవతెలంగాణ-పటాన్‌చెరు

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని పటాన్‌చెరు ఎంపీపీ సుష్మ శ్రీ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ సుష్మ శ్రీ వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సుదీర్ఘ చర్చ కొనసాగింది. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తమ గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా ముత్తంగి, ఇస్నాపూర్ గ్రామాల సమస్యల గురించి ప్రస్తావించగా.. అధికారులు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీపీ సుష్మ శ్రీ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ సుప్రజా వెంకట్ రెడ్డిలు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుధ్యం పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రజలను వ్యాధులకు దూరంగా ఉంచాలని సూచించారు. వాయిదా పడ్డ పనులు వెనువెంటనే పరిష్కరిస్తామని, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తారన్నారు. మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బన్సీలాల్, తహసిల్దార్ భాస్కర్, ఎంపీపీ హరిశంకర్ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విషం చిమ్ముతున్న 'రైస్‌మిల్'



- యథేచ్ఛగా నీటి వ్యర్థాల విడుదల
- దుర్వాసన భరించలేక రైతులు, ప్రయాణీకులకు నరకయాతన
- ఆ మురికి నీరు తాగి మూగజీవాలు మృత్యువాత

నవతెలంగాణ-పుల్కల్

మండల కేంద్రంలోని శ్రీరామ మాడ్రన్ రైస్ మిల్ నుంచి యథేచ్ఛగా వ్యర్థ నీటిని బయటికి వదులుతున్నారు. రోడ్డు పక్కనే ఆ మిల్లు ఉండడంతో.. వ్యర్థ నీరంతా రోడ్డు పక్కనే నిల్వ ఉంట ున్నాయి. దాంతో ఆ దారి గుండా పొలాల వద్దకు వెళ్లే రైతులు, అటు వైపు నుంచే వెళ్లే ప్రయాణీకులు అక్కడి దుర్వాసనను భరించలేక నరకయాతన అనుభవిస్తున్నారు. అంతేకాకుండా ఆ రైస్‌మిల్లు ద్వారా వచ్చే పొట్టు ద్విచక్ర వాహనదారుల కండ్లల్లో పడుతుండడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాకుండా సింగూరు ప్రాజెక్టును చూడడానికి వస్తున్న పర్యాటకులు సైతం ఈ దుర్వాసన వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపక్కనే ఉన్న ఆ నీటిని తాగి పలు పశువులు సైతం మృత్యువాత పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇదే విషయమై మిల్లు యజమానిని అడిగితే.. వ్యర్థాలను తన పొలంలోకి మాత్రమే వదులుతున్నానని.. ఎవ్వరి పశువులను కూడా తన పొలం వద్దకు తీసుకురావద్దంటూ హెచ్చరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అలాగే ఈ రైస్‌మిల్లుకు అన్నిరకాల అనుమతులు ఉన్నాయంటూ.. ప్రశ్నించే వారిని బెదిరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. నీటి వ్యర్థాల విషయమై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



డీపీఓను కలిసిన పంచాయతీ కార్యదర్శుల ఫోరం సభ్యులు



నవతెలంగాణ-మెదక్

టీఎన్జీవోల పంచాయతీ కార్యదర్శుల ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన రెబ్బ సంతోష్ కుమార్ బుధవారం డీపీఓ సాయిబాబాను మర్యాద పూర్వకంగా కలిశారు. మెదక్ కలెక్టరేట్‌లో పంచాయతీ కార్యదర్శుల ఫోరమ్ జిల్లా అధ్యక్షులు జంగం నగేష్ ఆధ్వర్యంలో డీపీఓను కలిసి శాలువాతో సన్మానించారు. అలాగే పంచాయతీ కార్యదర్శుల ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సంతోష్ కుమార్‌ను డిపిఓ శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట తాలుక టిఎన్జీవో అధ్యక్షులు అనుముల ప్రభాకర్, సభ్యులు నాంపల్లి ముత్యం, సాయిబాబా తదితరులు ఉన్నారు.

సేరి అంగన్వాడి కేంద్రంలో సామూహిక సీమంతాలు



నవతెలంగాణ-వెల్దుర్తి

మండల పరిధిలో చేరిలా అంగన్వాడీ కేంద్రంలో బుధవారం అంగన్వాడీ టీచర్ లక్ష్మి ఆధ్వర్యంలో పోషణ అభియాన్‌లో భాగంగా గర్భిణీలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ లక్ష్మి మాట్లాడారు. గర్భిణీలు అంగన్వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్వాడి సెంటర్ లో అందించే ఆరోగ్యలక్ష్మి ఒక పూట సంపూర్ణ ఆహారాన్ని ప్రతిరోజు తీసుకోవాలని సూచించారు. ఇమ్యూనైజేషన్‌లో భాగంగా ఏఎన్ఎం స్రవంతి మాట్లాడారు. ప్రతినెల గర్భిణీలు ఆరోగ్య పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలన్నారు. రక్తహీనతకు గురికాకుండా ఐరన్ మాత్రలు వేసుకోవాలన్నారు. గర్భవతి ఆరోగ్యంగా ఉండి పండంటి బిడ్డకు జన్మనివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయురాలు లలిత, ఆశ వర్కర్ మంజుల తల్లులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల మండల కమిటీ ఎన్నిక



అధ్యక్షులుగా వంజరి సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా రవి గౌడ్

నవ తెలంగాణ-నర్సాపూర్

రేషన్ డీలర్ల సంఘం నర్సాపూర్ మండల కమిటీని బుధవారం పట్టణంలోని టీఎన్జీవో భవనంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పిల్లి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా వంజరి సుధాకర్,, ప్రధాన కార్యదర్శిగా రవి గౌడ్‌తో పాటు గౌరవ అధ్యక్షులుగా నర్సింలు, ఉపాధ్యక్షులుగా గోవర్ధన్ రెడ్డి, రమేష్ గౌడ్, కోశాధికారిగా దశరథ్, సహాయ కార్యదర్శిగా రాజు, గోపాల్ గౌడ్, సభ్యులుగా వీరేశం చందర్, సర్దార్, మల్లేశం, బిక్షపతిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు జైపాల్, నాయకులు అశోక్, సంజీవరెడ్డి, శ్రీశైలం, ప్రభాకర్, రమేష్ గుప్తా తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకునికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ



నవతెలంగాణ-కౌల్దారం

మండలంలోని అంసానిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయుడు నాయికోటి నాగేశ్వరరావు తల్లి నాయికోటి లక్ష్మమ్మ (70) గత వారం రోజుల క్రితం గుండె పోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డితోపాటు రాష్ట్ర నాయకులు సోమన్నగారి రవీందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి అంజనేయులు గౌడ్ లు బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు మల్లేశం గౌడ్, శేఖర్ రెడ్డి, గోవర్ధన్, ప్రవీణ్ రెడ్డి, ఏసు తదితరులు ఉన్నారు.

23న విద్యుత్ వినియోగదారుల సమావేశం



ఏఈ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ ఆవరణలో ఈ నెల 23న, విద్యుత్ వినియోగదారుల సమావేశం ఉంటుందని బుధవారం ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. మారిన ప్రభుత్వాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యుత్ శాఖ ఎస్ఈ జానకిరామ్ ఇచ్చిన ఆదేశాల మేరకు నిర్వహించే ఈ విద్యుత్ వినియోగదారుల సమావేశంలో వినియోదారులు నేరుగా అధికారులను కలిసి తమ సమస్యలను రాతపూర్వకంగా ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశానికి ఉమ్మడి మాసాయిపేట వెల్దుర్తి మండలాల వినియోగదారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

దళిత బంధుకు కాంగ్రెస్‌కు సంబంధం లేదు

భూమయ్యకు కాంగ్రెస్‌కు సంబంధం లేదు



నవతెలంగాణ-టేక్మాల్

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ప్రెస్ మీట్ నిర్వహించి దళిత బంధుపై భూమయ్య, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మధ్యన జరిగిన గొడవల్లోకి మంత్రి దామోదర్ రాజనర్సింహను లాగడం వాళ్ల అవివేకానికి వదిలేస్తున్నామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్ అన్నారు. బుధవారం టేక్మాల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి భూమయ్య బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌తో సన్నిహితంగా ఉన్న ఫోటోలను విడుదల చేశారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇలాంటి వాటిని ప్రోత్సహించరన్నారు. కాంగ్రెస్ పార్టీలో సైనికులాంటి కార్యకర్తలు ఉన్నారని ఇలాంటి చౌకబారు ప్రయత్నాలు తమ నాయకుడుగాని, తమ కార్యకర్తలుగాని చేయరన్నారు. ఇప్పటికైనా మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. అభివృద్ధి కోసం ప్రజల బాగోగుల కోసం సలహాలు సూచనలు ఇస్తే స్వీకరించడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, సత్యనారాయణ, భూమి రెడ్డి, నరసింహారెడ్డి, పులి రవి, దుబ్బాకలో సామిల్, భక్తుల కిషోర్, అనిల్, హనుమంత్ గారు చంద్రయ్య, తదితరులు ఉన్నారు.

మూల మలుపు వద్ద లారీ బోల్తా డ్రైవర్‌కుగాయాలు



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

పాత ప్రభుత్వ లెప్రసీ మెదక్ బోధన్ ప్రధాన రహదారి మూల మలుపు వద్ద బుధవారం లారీ బోల్తా పడటంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు మెదక్ వైపు నుంచి బోధన్ వైపు వెళ్తున్న లారీ ఔరంగాబాద్ శివారులో లెప్రసి ఆసుపత్రి వద్ద ఉన్న మలుపు వద్ద లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ రంజిత్‌కు స్వల్ప గాయాలు కావడంతో ఆయనను అంబులెన్స్‌లో మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అధికారిక ఆహ్వానాలలో నిబంధనలు పాటించాలి

జెడ్పీ సీఈవో శైలేష్

నవతెలంగాణ-మెదక్

ప్రభుత్వ అధికారిక ఆహ్వానాలలో నిబంధనలు పాటించాలని జెడ్పీ సీఈవో శైలేష్ బుధవారం తెలిపారు. ప్రభుత్వంచే నామినేట్ చేయబడిన వివిధ కార్పొరేషన్ సంస్థల అధ్యక్షులు, చైర్మెన్‌ల పదవీ కాలం ప్రభుత్వం రద్దు చేసినందున సమాచారం, ఆహ్వానాలను పంపుట నిలుపుదల చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మండల ప్రజాపరిషత్ అధికారులకు జెడ్పీ సీఈవో శైలేష్ ఆదేశాలను జారీచేశారు. ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రోటోకాల్ పాటించి సమాచారం, ఆహ్వానాలు పంపాలని మండల ప్రజా పరిషత్, పంచాయత్ రాజ్, సంబంధిత అధికారులకు సూచించారు. ఈ విషయాన్ని మెదక్ జిల్లా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తప్పక పాటించాలని ఆదేశించారు. ఆదేశాలు ఉల్లంఘనకు పాల్పడితే తెలంగాణ సివిల్ సర్వీసెస్ సీసీఏ రూల్స్ ప్రకారం, అధికారులు బాధ్యత వహించాలని పేర్కొన్నారు.

వైకుంఠధామం పూర్తయ్యేది ఎప్పుడు?

- 5 సంవత్సరాలు దాటినా పూర్తిగాని వైకుంఠధామం
- పట్టించుకోని అధికారులు
- వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తుల వేడుకలు



నవతెలంగాణ-నిజాంపేట

గత రాష్ట్రప్రభుత్వం ప్రతి గ్రామంలో వైకుంఠధామాలు నిర్మించాలని ప్రతి వైకుంఠధామానికి రూ.12.50 లక్షలు ప్రభుత్వం కేటాయించినప్పటికీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వలన నేటికీ పూర్తి కావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలో వైకుంఠధామం పూర్తికాక భూమిలేని నిరుపేదలు శవాలను ఎక్కడ దహనం చేయాలో తెలియక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఐదు సంవత్సరాల నుంచి వైకుంఠధామం పూర్తి కాకుండానే మధ్యలోనే పనులను నిలిపివేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కూడా పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైకుంఠధామాలను పూర్తిచేసేలా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నిజాంపేట వాసి కన్నాపురం బాగా గౌడ్



గ్రామంలో భూమిలేని నిరుపేదలు ఎంతోమంది ఉన్నారని వారు చనిపోతే వారి శవాలను ఎక్కడ దహనం చేయాలో తెలియక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే వైకుంఠధామాలను పూర్తిచేసేలా తగు చర్యలు తీసుకోవాలి.

పదవుల కోసం పార్టీలు మారడం సునీత రెడ్డికే చెల్లు

- డీసీసీ అధ్యక్షుడు అంజనేయులు గౌడ్
- సంగాయిపేటలో బస్ సెల్టర్‌ను ప్రారంభించిన రాజిరెడ్డి, రవీందర్ రెడ్డి





నవతెలంగాణ- కౌల్దారం

పదవుల కోసం ఊసరవెల్లిలా పార్టీలు మారడం సునీత రెడ్డికే చెల్లు అని డీసీసీ అధ్యక్షుడు అంజనేయులు గౌడ్, నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, రాష్ట్ర నాయకులు రవీందర్ రెడ్డిలు అన్నారు. బుధవారం కౌల్దారం మండలం రంగంపేట, సంగాయిపేట, చిన్న గణపురం గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ జెండావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మల్లేశం గౌడ్ అధ్యక్షతన ఆయా గ్రామాలలో జరిగిన సమావేశాలలో మాట్లాడారు. సంగాయిపేట గ్రామంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి తన సొంత నిధులతో నిర్మించిన బస్టాండ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. సునీత లక్ష్మారెడ్డికి రాజకీయ బిక్ష పెట్టింది కాంగ్రెస్ పార్టీయే అన్న విషయం ఆమె మర్చిపోయారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలను వేధింపులకు గురి చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. అలాంటి పద్ధతులు వెంటనే మానుకోవాలని లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. అలాగే నాలుగున్నర సంవత్సరాలుగా మహిళా కమిషన్ చైర్మన్ హోదాలో ప్రోటోకాల్ పదవిలో ఉన్నప్పటికీ మెదక్ జిల్లాను రాజన్న సిరిసిల్ల జోన్‌లో కలపడం జిల్లాలోని నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్న విషయం ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోగానే జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని ఉద్యమాలు చేస్తున్నామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నర్సాపూర్ సభలో ప్రకటించినట్లు జిల్లాను చార్మినార్ జోన్‌లో త్వరలో కలపనున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే గా గెలవలేదని అధైర్య పడద్దని రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్నందున కార్యకర్తలకు, ప్రజలకు ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడనున్నామని తెలిపారు. పార్టీని బూత్ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు బలోపేతం చేయడానికి నాయకులు కలిసికట్టుగా పని చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు సోమన్నగారి రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోతిరెడ్డిపల్లి శేఖర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దర్జీ రాజు, నాయకులు మహేశ్వర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మూర లక్ష్మయ్య, తాటి సాయిబాబా, మాజీ సర్పంచ్ బధ్యానాయక్, గొండ కృష్ణ, వెంకట్ గౌడ్, బాల్ రాజు, అశోక్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలి

అథ్లెటిక్ పోటీలను ప్రారంభించిన అదనపు కలెక్టర్ రమేష్









నవతెలంగాణ-మెదక్ / మెదక్ టౌన్

అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మెదక్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) రమేష్ పేర్కొన్నారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో మెదక్ డిస్టిక్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేషనల్ ఇంటర్ డిస్టిక్ అథెటిక్స్ మీట్‌ను ప్రారంభించారు. అండర్ 14, 16 బాయ్స్ అండ్ గర్ల్స్ పోటీల్లో సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ కలెక్టర్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తెలిపారు. పట్టుదలతో సాధన చేయడం వలన మంచి నైపుణ్యాన్ని సాధించవచ్చని, క్రీడల్లో ఉన్నతమైన స్థానానికి చేరుకోవచ్చని తెలిపారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో మెడల్స్ సాధించి జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాధాకిషన్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ అబ్జర్వర్ కేపీ అనిల్, సుదర్శనమూర్తి, ఏఎంఓ జి. రమేష్, ఎస్జిఎఫ్ సెక్రటరీ, ఎస్. నాగరాజు, మెదక్ డిస్టిక్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి ఏ. మధుసూదన్, అసోసియేషన్ కోశాధికారి సుజాత, పీఈటీలు రమేష్, మైపాల్, సుమన్, చంటి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన ఎంపీపీ



తెలంగాణ-వెల్దుర్తి

కరాటే పోటీల్లో ఉత్తమ పప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపీపీ అభినందించారు. రెంజుకి చోటో ఖాన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న మెదక్ ఆర్ఎస్‌పి ఫంక్షన్ హాల్‌లో జాతీయస్థాయి ఇంటర్ స్కూల్ కరాటే పోటీలు నిర్వహించారు. వెల్దుర్తి మండలం మానేపల్లి గ్రామానికి చెందిన ఎంపీపీఎస్ విద్యార్థినిలు బంగారు, వెండి, కాస్య పథకాలతో పాటు సర్టిఫికెట్లు ఓవరాల్‌గా గ్రాండ్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బుధవారం మానేపల్లి ఎంపీపీఎస్ పాఠశాల ఆవరణంలో ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ పోతిరెడ్డి అందువలనపల్లి శ్రీనివాస్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి గ్రామ పెద్దలతో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రొసెక్షన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు కరాటే శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణతో బాలికలకు ఆత్మవిశ్వాసంతో పాటు ఆత్మరక్షణ, క్రమశిక్షణ వంటి లక్షణాలు సిద్ధిస్తాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు శ్రీజిత, మానేశా, భావన, మౌనిక, వీణ, అశ్వత్థ, సంధ్య, వైష్ణవి, నందిని, శివలీల, నందిని, రక్షిత, నందీశ్వరి, శ్రీవల్లి, సంధ్య, శ్రీలత, నవనీత, గీతాంజలి, సంధ్య, వైష్ణవిలను అభినందించారు.

30న జాతీయ లోక్ అదాలత్



నవ తెలంగాణ-మెదక్ టౌన్

జిల్లా కోర్టు ఆవరణలో ఈ నెల 30వ తేదిన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద స్పష్టం చేశారు. జిల్లా కేంద్రమైన మెదక్ కోర్టు ప్రాంగణంలో బ్యాంకు, ఇన్సూరెన్సు స్టాండింగ్ కౌన్సిల్స్, చిట్‌ఫండ్స్ కౌన్సిల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో మెదక్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను, రాజీ కుదుర్చుకునే కేసులలో రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకునే విధంగా న్యాయవాదులు సహకరించాలని కోరారు. ఈ సదావకాశాన్ని ప్రజలు, కక్షిదారులు వినియోగించుకుని ఎక్కువ మొత్తంలో రాజీ కుదుర్చుకునే కేసులలో రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు.అదేవిధంగా మెదక్ జిల్లా కోర్టు ప్రాంగణంలో డైలీ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ డైలీ లోక్ అదాలత్‌ను, నేషనల్ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జితేందర్, స్టాండింగ్ కౌన్సిల్స్, చిట్‌ఫండ్స్ కౌన్సిల్స్, ప్యానల్ లాయర్స్, రిటైనర్ లాయర్స్, ఇతర న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-కౌడిపల్లి

రైతులు ఉచిత పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కౌడిపల్లి పశువైద్యాధికారి రాజు కోరారు. మండలంలోని బుజరంపేట గ్రామంలో విజయ డైరీ, పశుగణాభివృద్ధి సంస్థ మెదక్ కౌడిపల్లి పశువైద్య, పశుసంవర్ధక వారి అధ్వర్యంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌడిపల్లి పశువైద్యదికారి రాజు మాట్లాడుతూ ఈ శిబిరంలో 10 ఉచిత కృత్రిమ గర్భధారణ, 28 దూడలకు నట్టాల నివారణకు మందులు త్రాగించినట్లు తెలిపారు. 20 గర్భకోశ వ్యాధులను గుర్తించి చికిత్స, సాధారణ చికిత్సలు 30 పశువులకు చేయడం జరిగిందని తెలిపారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని తమ పశువులను కాపాడుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వనజ శ్యామ్ సుందర్, ఉప సర్పంచ్ సాయిలు, ఎంపిటిసి నాయి కోటి సత్తయ్య, నాయి కోటి లింగం, జేవివో కృష్ణ కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ చెన్నయ్య, పంచాయతీ సెక్రటరీ రాజిరెడ్డి, విజయ డైరీ భారత్ గోపాల మిత్ర సూపర్ వైసార్ శ్రీనివాస్ రెడ్డి, గోపాల మిత్రాలు శ్రీకాంత్, మనయ్య, ప్రవీణ్, కవిత, దీపక్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

హవేలీ ఘనపూర్ మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన వడ్ల నాగభూషణంకు గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ మృతి చెందాడు. బుధవారం కాంగ్రెస్ పార్టీ బూరుపల్లి నాయకులు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి డాక్టర్ రోహిత్‌కు సమాచారం తెలపగా మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి ఎంపీటీసీ చిట్యాల అర్చన శ్రీనివాస్, నాయకులు మంజుల సిద్ధగిరి గౌడ్, అరికెల బాలరాజ్, వెంకట్, లెంక రాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 4
సిద్దిపేట
గురువారం 21 డిసెంబర్ 2023 www.navatelangana.com

బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలి

నవతెలంగాణ-కోహెడ



బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈవో పావని అన్నారు. బుధవారం మండలంలోని కూరెళ్ళ గ్రామ శివారులోని ఇటుక బట్టీల వద్ద ఉన్న బడిబయటి పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. తల్లిదం డ్రులు విద్యార్థులను పనులకు తీసుకువెళ్లి వారి బంగారు భవిష్యత్తును పాడుచేయవద్దన్నారు. ఇటుక బట్టీల వద్దనే వర్క్‌సైట్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. బడిబయట పిల్లలు లేకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అలాగే పాఠశాలలలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం, ఉన్నతి ప్రోగ్రామ్‌ల అమలు తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ వెల్ది రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

ముండ్రాయిలో కంది పంటపై క్షేత్రస్థాయి పర్యటన

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండలం ముండ్రాయి గ్రామంలో డబ్ల్యుఆర్.జి. 255 అనే అధిక దిగుబడి నిచ్చే కందిరకాన్ని రైతు ఎస్.కరుణాకర్ రెడ్డి పొలంలో సాగు చేశారు. ఏరువాక కేంద్రం తోర్నాల శాస్త్రవేత్త పల్లవి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వరంగల్ నుంచి డాక్టర్ సంధ్య కిషోర్, డాక్టర్ వీరన్న, డాక్టర్ మధు హాజరై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కంది రకం లక్షణాలు ఎండు తెగుల్ని తట్టుకుంటుందన్నారు. 180 రోజుల పంట కాలం కలిగి 8-10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలియజేశారు. ఈ కందిలో సస్యరక్షణ,పురుగు తెగుళ్ల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అశోక్, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల్లో నిరుత్సాహం

- అధికార పార్టీ వైపు చూస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-గజ్వేల్

అధికారం కోల్పోయి నెల రోజులు కాకముందే గజ్వేల్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు నిరుత్సానికి గురవుతున్నారు. స్థానికంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి పోటీ చేసి గెలిచినా.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు నెల రోజులు గడవకముందే జీర్ణించుకోలేకపోతున్నారు. పది సంవత్సరాలు అధికారాన్ని అనుభవించిన నాయకులకు అధికారం కోల్పోయి నిద్ర పట్టడం లేదు. అధికారాన్ని కోల్పోయామని కలలో సైతం కలవరపడుతున్నామని ఆ పార్టీ నేతలు చర్చించుకోవడం కల్పిస్తోంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్లో గెలిచినప్పటికీ కార్యకర్తలు నాయకుల్లో తృప్తి లేదు. అధికారంలోకి కాంగ్రెస్ కావడం వల్ల తమ పైరవీలకు అవకాశం ఉండదని భావిస్తున్న నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలు అధికార పార్టీ నాయకులతో సంప్రదింపులు ప్రారంభించినట్లు వినికిడి. అధికారం లేకపోతే బతకలేమనే నాయకులు తొందరపడుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన నాయకులు కలుస్తున్నారు. పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికలకు సి ద్ధం కావాలని సూచి స్తున్నప్పటికీ నాయకుల్లో మాత్రం పార్టీ మారదామని కాంగ్రెస్ కండువా వేసుకుందామని ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసి ఓడిపోయిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డికి నియోజక వర్గంలో జరిగే కార్యక్ర మాలకు పూర్తి బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డి ఇవ్వడంతో బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు నర్సారెడ్డిని వాకప్ చేస్తున్నారు. తాము పార్టీలోకి వస్తామని వచ్చే అన్ని ఎన్నికల్లో తమకంటూ ఒక స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పదవుల కోసమే కాకుండా పార్టీ కోసం సేవ చేసేందుకు వస్తే సరిపోతుందని సమాధానం ఇస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో కనీసం పాత బిల్లులు, పాత కాంట్రాక్ట్ పనులు పూర్తి చేసుకున్నందుకు అధికార పార్టీలో అడుగు పెట్టాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో ముఖ్యమైన ప్రజా ప్రతినిధులు పదవులకు కొందరు నేతలు టెండర్ వేసినట్టు తెలుస్తుంది. సుమారు ఐదు కోట్లు ఇస్తే పదవి వదిలి వేస్తారా? అని ప్రశ్నలు వేసుకుంటున్నారు. పదవి ఇవ్వలేం కానీ పార్టీలోకి వస్తామని ప్రాధేయ పడుతున్నారు. ఈ ఐదు సంవత్సరాలు కాలం ఎలా గడుస్తుంది. తాము కాంట్రాక్టు పదవుల్లో పెట్టిన డబ్బులను ఎలా తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు ప్రయ త్నాలు చేస్తున్నారని తెలిసింది. పదవుల్లో ఉన్న నాయకులు కూడా పార్టీ మారా లని ప్రయత్నం చేస్తున్నారు. అధికార పార్టీలో కార్పొరేషన్, నామినేటెడ్ పదవు లను దక్కించు కోవచ్చని బీఆర్ఎస్ నాయకులు అధికార పార్టీ వైపు చూస్తున్నారు. నియోజకవర్గంలో కోట్లాది రూపా యల అభివృద్ధి పనులు జరిగిన చాలామంది నాయకులకు బిల్లులు రాలేకపో యాయి. గజ్వేల్, తూప్రాన్ మున్సిపా లిటీలో చేపట్టిన అభివృద్ధి పనులకు పూర్తిస్థాయిలో నిధులు రాలేదు. అభివృద్ధి పనులు చేయడానికి నిధులు మంజూరై సిద్ధంగా ఉన్నాయి. ఈ నిధుల విషయంలో అధికార పార్టీ నాయకులు సంబంధిత శాఖ అధికారులకు నిలిపివేయాలని ఇప్పటికే సూచించిన విషయం తెలిసింది. ఇది రాష్ట్రస్థాయిలో సీఎం రేవంత్‌రెడ్డి కింది స్థాయి అధికారుల వరకు ఆదేశాలు ఇవ్వాలని సంబంధిత జిల్లా పాలనా ధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎంపీపీలు, జెడ్పీ టీసీలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు పరిధిలో ఉండే పనుల విషయంలో ఇబ్బందులకు గురవుతున్నారు. గజ్వేల్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గెలిచినప్పటికీ పూర్తి అధికారాన్ని మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి చేతుల్లోకి వెళ్లిపోయింది. దీంతో స్థానిక నేతలు కొంత అసంతృప్తికి గురవుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి సేవ చేసిన వారికే ముందు వరుసలో పదవులు ఉంటాయని ఇతర పార్టీల నుండి ఇప్పుడే పార్టీలోకి తీసుకోవద్దని సీఎం రేవంత్‌రెడ్డి అధికార పార్టీ నేతలకు ఎమ్మెల్యేలకు, మాజీ ఎమ్మెల్యేలకు గట్టిగా ఆదేశాలు ఇచ్చారు. మూడు సంవత్సరాల తర్వాత ఇతర పార్టీల నాయకులకు చేర్చుకునేందుకు అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీంతో పది సంవత్సరాలు అధికారం అనుభవి ంచిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు కొందరు అయోమ యానికి గురవుతున్నారు. గజ్వేల్ నియో జకవర్గంలో బీఆర్ ఎస్ పార్టీ నుంచి బయటకు రావాలని చాలామంది ప్రయ త్నం చేస్తున్నారు. ప్రస్తుతం అధికార పార్టీలో నియోజకవర్గంలోని 9 మండలాల్లో మండల పరిష త్, జిల్లా పరిషత్, సర్పంచులు, మున్సిపల్ చైర్మన్, సింగిల్ విండో ఎన్నికలకు సంబంధించిన కాంగ్రెస్‌కి బలమైన క్యాడ ర్ పెద్దగా లేకపోవడం వల్ల బీఆర్ఎస్ నాయకులు దాని ఆసరా చేసుకుని కాంగ్రెస్లో చేరుదామని ఎక్కడెక్కడ నుంచో అనుబంధాలను ముడిపెడుతున్నట్లు తెలుస్తుంది.

చదువుతోనే విజ్ఞానం



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

చదువుతోనే విజ్ఞానం అలబడుతుందని రూమ్ టు రీడ్ సంస్థ ఉమ్మడి రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ రాంబాబు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం నాంచారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం సందర్శించి రూమ్ టు రీడ్ గ్రంథాలయాన్ని విద్యార్థులు చదువుతున్న తీరును పరిశీలించారు. పిల్లలతో ఇంట్రాక్ట్ అయ్యారు. కథల పుస్తకాలు చదివించి వారి ద్వారా భావాన్ని చెప్పించారు. ప్రతి అంశంలోనూ విద్యార్థులు చక్కగా ప్రతిభ కనపరిచారని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. పాఠశాలల అభివృద్ధికి ప్రోత్సహించడం కోసం ఎంపిక చేసిన పాఠశాలల్లో పిల్లలు ధారాళంగా చదవడంతో పాటు చదివింది అర్థం చేసుకోవడం కోసం రూమ్ టు రీడ్ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయాలను ఏర్పాటు చేసి పుస్తకాలను సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు గ్రంథాలను ఉపయోగించుకొని భాష జ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నారని తెలిపారు. ఆయన వెంట రమ్ టు రీడ్ సంస్థ కోఆర్డినేటర్ సిహెచ్ రవీందర్, పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్ రవి దేవరాజ్, సుజాత ఉన్నారు.

నిరుపేద వధువుకు పుస్తె మట్టెల అందజేత



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు గ్రామంలో నిరుపేద కుటుంబమైన దండెబోయిన భాగ్య-సత్తయ్య ముదిరాజ్ దంపతుల కూతురు స్వాతి వివాహానికి సర్పంచ్ చౌదుచెర్ల మమత జయపాల్ రెడ్డి హాజరై బుధవారం పుస్తె మట్టెలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేదలకు సహాయం చేయడం వల్ల సంతృప్తిగా ఉందన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావు సహకారంతో పేదలకు మరిన్ని సేవా కార్యక్రమాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వధువు కుటుంబ సభ్యులు, ముదిరాజ్ కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి గణిత సెమినార్‌కు ఉపాధ్యాయుడు రవివర్మ ఎంపిక

నవతెలంగాణ-కోహెడ



రేపు హైద్రాబాద్‌లో గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాసరామనుజన్ జయంతి సందర్భంగా గణితశాస్త్ర సెమినార్‌కు మండలంలోని వింజపల్లి ఆమ్లెట్ గ్రామం పెరుకలగడ్డ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.రవివర్మ ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో పావని, గ్రామస్థులు ఉపాధ్యాయుడిని అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గణితశాస్త్ర పాత్ర అంశంలో పరిశోధన పత్రం ఎంపిక కావడం జరిగిందన్నారు. ప్రాథమిక స్థాయి నుండే వేద గణితం నైపుణ్యాలను అలవరచాలని, దానితో గణితం పట్ల ఆసక్తిని పెంపొందిస్తూ ఖచ్చితత్వం, వేగాన్ని కూడా వృద్ధి చేయవచ్చునన్నారు. గణిత సాహిత్యాన్ని సందర్భానుసారంగా వినియోగం జరగాలని, ప్రాజెక్టులను స్వీయ కృత్యాల అంశాలను వివరించారు. గణితంపై ఎలాంటి ఆందోళన వద్దని, సులభంగా నేర్చుకునే పద్ధతిని విద్యార్థులకు అందించాలన్నారు. గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయునికి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్టీసీ బస్సు నుంచి పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-మిరుదొడ్డి

ఆర్టీసీ బస్సులో నుంచి ఓ విద్యార్థిని కిందపడి తీవ్ర గాయాలైన ఘటన అక్బర్ పేట భూంపల్లి మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అక్బర్‌పేటకు చెందిన రాజు, రజిత రెండో కుమార్తె స్పందన మండల పరిధిలోని నిజాంపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. ఈ క్రమంలో రోజు మాదిరిగానే పాఠశాలకు వెళ్లడానికి అక్బర్ పేట స్టేజి దగ్గర సన్నద్ధమై ఉన్నది. మెదక్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సిద్దిపేట నుంచి మెదక్ వెళుతున్నది. బస్సు డ్రైవర్ అక్బర్ పేట స్టేజి వద్ద కొన్ని నిమిషాల పాటు నిలిపాడు. అందులో స్పందనతో పాటు మరో నలుగురు విద్యార్థులు బస్సులోకి ఎక్కారు. అప్పటికే బస్సులో సుమారు 140 మందితో రద్దీగా ఉన్నది. ఈ క్రమంలో వేరే బస్సులో వెళ్లాలంటే పాఠశాల సమయం మించి పోతుందనే ఉద్దేశంతో గత్యంతరం లేక ఆ బస్సులోనే వెళ్లడానికి సిద్ధమయింది. బస్సు కదలడంతో డోర్‌లో నిలబడిన స్పందన ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డది. దీంతో ఆమెకు కాలుకు తీవ్ర గాయమై రక్తస్రావమైనది. స్పందన బస్సు లోంచి కింద పడ్డప్పటికీ బస్సును డ్రైవర్ నిలపలేదు. కదులుతున్న బస్సును స్థానికులు వెంబడించారు. దీంతో బస్సు డ్రైవర్ నగరం గ్రామ శివారులో నిలపాడు. బస్సులో నుంచి విద్యార్థిని కింద పడ్డప్పటికీ ఎందుకు బస్సును నిలపలేదంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వచ్చే వరకు బస్సు ఇక్కడి నుంచి కదలనివ్వమని ఆందోళన చేశారు. నిర్లక్ష్యంగా బస్సులు నడుపుతున్న డ్రైవర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న భూంపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులను శాంతింపజేసే ప్రయత్నం చేసినప్పటికీ లాభం లేక పోయింది. పాఠశాల, కళాశాల వేళల్లో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బస్సులను నడిపించాలన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో బస్సులన్నీ రద్దుగా ఉంటున్నాయన్నారు. దీంతో తరగతులకు హాజరయ్యే విద్యార్థులు ప్రమాదాల బారిన పడడం భయాం



దోళనకు గురిచేస్తోందన్నారు. పాఠశాల, కళాశాల తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ప్రత్యేక బస్సులను నడిపించడానికి చర్యలు తీసుకునేలా అధికారులకు విన్నవిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో స్థానికులు విద్యార్థిని తల్లిదండ్రులు ఆందోళన విరమించారు. చికిత్స నిమిత్తం క్షతగాత్రులైన విద్యార్థిని స్పందనను నిజాంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పలువురికి రఘునందన్ పరామర్శ



నవతెలంగాణ-దుబ్బాక

ఇటీవల అనారోగ్యంతో మరణించిన కుటుంబాలను దుబ్బాక మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు బుధవారం పరామర్శించారు. దుబ్బాక మండల పరిధిలోని అచ్చుమాయిపల్లిలో సంఘం మల్లారెడ్డి మరణించిన విషయం తెలుసుకొని ఆయన కుమారుడు, భవాని కన్స్ట్రక్షన్స్ అధినేత సంఘం మధుసూదన్ రెడ్డిని, గంభీర్ పూర్ గ్రామంలో రేపాక ఆశిరెడ్డి మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు పరామర్శించారు. బీజేపీ నాయకులు మంద అనిల్ రెడ్డి పలువురున్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకురాలి ప్రతిభ

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాలుర సముదాయంలో మైక్రో బయాలజీ విభాగానికి చెందిన అధ్యాపకురాలు తుమ్మ లావణ్య 'సస్టైనబుల్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్మెంట్ - ఇష్యుస్ అండ్ చాలెంజెస్' అనే అంశం పై ఉత్తమ ప్రతిభ కనబరిచిందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రతిభ కనబరిచిన లెక్చరర్‌ను బుధవారం కళాశాల సిబ్బందితో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యప్రదేశ్ మహాకౌషల్ యూనివర్సిటీ నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొని ఉత్తమ పరిశోధనా పత్రానికి గాను ఎంపికవ్వడం సంతోషకారమన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహా కౌశల్ యూనివర్సిటీ థాయిలాండ్ సంయుక్తంగా ఈ నెల 17 నుండి 28 తారీకు లలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించారన్నారు. ఆ సదస్సుకు మా కళాశాల మైక్రో బయాలజీ అధ్యాపకురాలు తుమ్మ లావణ్య ' గ్రామీణ వ్యవసాయంలో మహిళా సాధికారత ప్రభావము-ఎ కేస్ స్టడీ ఇన్ గజ్వేల్' అనే పరిశోధనా పత్రాన్ని సమర్పించి ఉత్తమ పరిశోధనా పత్రంగా ఎంపికయ్యారన్నారు. ఇండియా థాయిలాండ్, బ్యాంకాక్ దేశాల నుండి దాదాపు 109 మంది పాల్గొన్నా రన్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో ఉత్తమ పరిశోధనా పత్రంగా ఎంపికైనందుకు అధ్యాపకురాలు లావణ్యని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, విభాగాధిపతి గోపు, విజయ భాస్కర్‌రెడ్డి, కళాశాల బృందం అభినందించమన్నారు.

వరినారులో సస్యరక్షణ చర్యలు అవసరం

నవతెలంగాణ-జగదేవపూర్

వరినారులో సస్యరక్షణ చర్యలు అవసరమని మండల వ్యవసాయ అధికారి వసంతరావు అన్నారు. చలికి వరి నారుమడిలో రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు సూచనలు చేశారు. మండలంలోని చాట్లపల్లి, తీగుల్ గ్రామాలలో రైతులు పోసిన వరి నారుమండ్లను వ్యవసాయ అధికారి యు వసంతరావు సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. యాసంగిలో చలి ప్రభావం తో నారు పెరగకపోవడం, ఆకులు పసుపు మరియు ఎరుపు రంగులోకి మారడం అలాగే నారు చనిపోవడం వంటివి జరుగుతాయని వీటిపై రైతులు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. సాయంత్రం వేళల్లో నారుమడిలో నీరు తీసివేసి పగటిపూట వెచ్చటి నీరు పెడుతూ ఉండాలి అన్నారు. ప్రతి రోజు సాయంత్రం ఒక అడుగు ఎత్తులో వెదురు బద్దలు అమర్చి దానిమీద సన్నని ప్లాస్టిక్ షీట్ లేదా కల్లాల పట్టాలు తో నారుమడి మీద కప్పి మరుసటి రోజు ఉదయం తీసి వేయాలి అని తెలిపారు. జింకు లోపం వలన ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడతాయి కావున జింక్ సల్ఫేట్ రెండు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి అని తెలిపారు. నారు ఆరోగ్యంగా పెరగడానికి యూరియా వేస్తున్నప్పుడు ఒక కిలో యూరియా కు రెండు గ్రాముల కార్బండిజమ్‌తో మాంకోజబ్ మిశ్రమ



మందును కలిపి పిచికారి చేయాలి అన్నారు. కాండం తొలిచూపురుగు/మోగి పురుగు బారి నుండి కాపాడుకోవడానికి కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలు ఎకరాకు సరిపడే నారుమడికి ఒక కేజీ చొప్పున చల్లాలని చలి తీవ్రత ఎక్కువ ఉండి మంచుతో కూడిన వాతావరణం ఉన్నచో అగ్గి తెగులు ఆశించకుండా ముందు జాగ్రత్తగా ట్రైక్లోజోల్ 0.6 గ్రాములు లీటర్ నీటికి చొప్పున పిచికారి చేయాలన్నారు. వరినారు పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

పారదర్శకంగా ఓటర్ నమోదు ప్రక్రియ చేపట్టాలి



నవతెలంగాణ-బెజ్జంకి

మండలంలోని ఆయా గ్రామాల్లో పారదర్శకంగా ఓటర్ నమోదు ప్రక్రియ చేపట్టాలని తహసీల్దార్ శ్యామ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఓటర్ నమోదు ప్రక్రియపై బీఎల్ఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ రాబోవు పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా జనవరి 1,2024 నాటికి 18 ఎండ్లు నిండిన వారందరిని ఓటంగా నమోదు చేసి మృతిచెందిన వారి వివరాలను ఓటర్ జాబితాలో సవరణలు చేయాలని బీఎల్ఓలకు సూచించారు.అయా గ్రామాల బీఎల్ఓలు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

టీపీటీఎఫ్ రాష్ట మాజీ ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి



నవతెలంగాణ-కోహెడ

సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యాక్షుడు తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని పలు పాఠశాలలలో బుధవారం మండల అధ్యక్షుడు బుడుగు రాజేందర్‌తో కలిసి టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు, సమస్యల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్స్, పెండింగ్ డిఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అలాగే కెజీబీవీ పాఠశాలలలో పనిచెసే ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు మహమూద్, నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు యల్.జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగింకోవాలి

నవతెలంగాణ-తొగుట

రైతులు ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అప్పనపల్లి శ్యామల ఆంజనేయులు సూచించారు. బుధవారం మండలంలోని రాంపూర్ గ్రామంలో పశు గణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన శిబిరంలో డాక్టర్ నిహారిక ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా 22 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు చేశారు. 15 పశువులకు సాధారణ చికిత్సలు,3 పశువులకు ఎద సూదులు వేశారు.18 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ నిహారిక మాట్లా డుతూ పశువులకు ఎద లక్షణాల గురించి వివరిం చారు.గర్భకోశ వ్యాధుల గురించి వాటి



నివారణ గురించి తెలిపారు.అనంతరం సర్పంచ్ గ్రామ సర్పంచ్ అప్పనపల్లి శ్యామల మాట్లాడుతూ గోపాల మిత్రుల సేవలను రైతులు సద్వినియోగం చేసు కోవాలన్నారు.ఉచిత పశు వైద్య శిబిరాలను ఉపయోగించుకోని పశువుల వ్యాధుల బారిన నుండి కప కాపాడుకోవలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సుతారి లలిత రమేష్,పంచాయతీ కార్యదర్శి దివ్య ఓఎస్ పురుషోత్తం,గోపాలమిత్ర సూప రైజర్ భాస్కర్ గౌడ్,గోపాలమిత్రలు మహేందర్ రెడ్డి, వాజిద్, పాడి రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వృద్ధాప్య దశ సృష్టిధర్మంలో భాగమే

నవతెలంగాణ-బెజ్జంకి

పుట్టిన దశ నుండి యుక్త దశ.. తదుపరి వృద్ధాప్య దశకు చేరడం సృష్టిధర్మంలో భాగమేనని, వృద్ధులకు చేయూతనందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని మాజీ ఎంపీపీ, రెండో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్ గ్రామంలోని కృపా భవనంలో బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అనాథ వృద్ధుల ఆదరణ పండుగను ఘనంగా నిర్వహించారు. పలువురు దాతల సహకారంతో బెజ్జంకి, ఇల్లంతకుంట, తిమ్మాపూర్, కోహెడ, చిన్నకోడూర్ మండలాలకు చెందిన సుమారు 40 మంది వృద్ధులకు నూతన దుస్తులు, నిత్యావసర సరుకులు, 25 కిలోల బియ్యం చొప్పున ప్రతి ఒక్కరికి ముఖ్య అతిథులుగా హాజరైన ఒగ్గు దామోదర్, చర్చి ఫాదర్ ప్రశాంత్, విలాసాగరం సత్యం, సతీష్ పంపిణీ చేశారు. బాలవికాస ప్రతినిధులు పాల్గొన్నారు.



పలువురికి కత్తి కార్తీక పరామర్శ



నవతెలంగాణ-దుబ్బాక

ఈరోజు మరణించిన పలువురి కుటుంబాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీకగౌడ్ బుధవారం పరామర్శించారు. దుబ్బాక పురపాలిక పరిధిలోని 20వ వార్డులో తుమ్మ సుశీల మరణించిన విషయం తెలుసుకొని వారి కుమారుడు బీఆర్ఎస్ నాయకుడు తుమ్మ శంకర్ ను,మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో గన్నెబోయిన మల్లాగౌడ్ కుటుంబ సభ్యులను, ప్రమాదవశాత్తు బైక్ యాక్సిడెంట్ కావడంతో సిద్దిపేటలోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పెద్ద చీకోడ్ గ్రామానికి చెందిన పత్రిక విలేకరి కుంభాల రవీందర్‌ను కత్తి కార్తీక గౌడ్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రవీందర్‌కు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. మాజీ జెడ్పీటీసీ అబ్బుల రాజలింగం గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాములు గౌడ్, రవి గౌడ్, మాజీ సర్పంచ్ రామానుజన్, ఐరేని సాయి తేజ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు తీగల బాల్ నర్సాగౌడ్, పలువురు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
గురువారం | 21 డిసెంబర్ 2023 | www.navatelangana.com

సమాజాభివృద్ధిలో గురువుల పాత్ర గొప్పది



నవతెలంగాణ-కొండపాక

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో విలువైనదని కుకునూరుపల్లి మండలం మంగోల్ గ్రామ సర్పంచ్ కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం ఉన్నత పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు ఇటీవల బదిలీపై వెళ్లడంతో వారికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీలు సహజమని ఎక్కడ ఉన్నా అంకితభావంతో పనిచేసి విద్యార్థులను ఉన్నతమైన వారిగా తీర్చిదిద్దాలని సూచించారు. బదిలీపై వెళ్లిన పీజీహెచ్ఎం రామచంద్రం, ఉపాధ్యాయులు నర్సింలు, రవీందర్‌లను ఉపాధ్యాయ బృందం విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హరిత సంతోష్ రెడ్డి, ఆత్మ కమిటీ సభ్యుడు కనకయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం సత్తయ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టో హామీలను అమలు చేయాలి



నవతెలంగాణ-మిరుదొడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఉన్న హామీలను అమలు చేయడంలో విఫలమైందని కోఆప్షన్ సభ్యులు హైమద్ అన్నారు. బుధవారం మిరుదొడ్డి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో గతంలో ఉన్న సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను అమలు చేయడంలో నిర్లక్ష్య వహించడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన పథకాలే నేడు రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం పేరుతో విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారన్నారు. పాఠశాలల సమయానుకూలంగా బస్సులు రాకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సకల సౌకర్యాలతో వడ్డేపల్లి పాఠశాలలు

- కార్పొరేట్‌కు దీటుగా వసతులు
- మన ఊరు మనబడి ద్వారా పాఠశాలల అభివృద్ధి









నవతెలంగాణ-రాయపోల్

పాఠశాలలను ఆధునీకరించి మెరుగైన విద్య కోసం గత ప్రభుత్వం సర్కారు బడుల రూపురేఖలు మార్చడానికి, కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలను రూపుదిద్ది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని 'మన ఊరు-మనబడి' కార్యక్రమానికి రూపకల్పన చేసింది. ఇందులో భాగంగా రాయపోల్ మండలంలో పలు పాఠశాలలు ఎంపిక చేశారు. వడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేసి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి విద్యార్థులకు అన్ని వసతులు కల్పించారు. పాఠశాలల్లో రూ.84 లక్షలతో మౌలిక, కనీస వసతులు కల్పించారు. ఆకర్షణీయమైన తరగతి గదులు, ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. వడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భోజనశాలకు రూ. 14 లక్షలు, విద్యుత్ ఆధునీకరణకు రూ.2 లక్షలు, తాగునీరు ఆధునీకరణకు రూ. 1.20 లక్షలు, ప్రహరీ నిర్మాణానికి రూ.8.75 లక్షలు, నూతన మరుగుదొడ్లు, వంటగది నిర్మాణాలు చేపట్టారు. ప్రాథమిక పాఠశాల ప్రహరీకి రూ.29 లక్షలు, మరుగుదొడ్లు ఇతర పనులకు రూ.7 లక్షలు కేటాయించారు. ఇతర సమస్యలను పరిష్కరించి పనులన్నింటినీ పూర్తి చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలు ప్రస్తుతం రూపురేఖలు మారి నూతన పాఠశాలలుగా తీర్చిదిద్దారు. ఈ రెండు పాఠశాలలు అభివృద్ధి చేయడంతో కార్పొరేట్‌కు ఏ మాత్రం తగ్గకుండా రాయపోల్ మండలంలో మార్గదర్శకంగా అవతరించాయి. కిచెన్ షెడ్, మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం కల్పించారు. విద్యుత్ ఆధునీకరణ పనులు చేపట్టారు. ఇతర మరమ్మతులు భవనాలకు, తరగతి గదులకు రంగులు వేసి సుందరీకరించారు. అన్ని తరగతి గదులలో ఆధునిక గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఒక్కో తరగతి గదికి 40 డ్యూయల్ డెస్కులు ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ ప్రత్యేక చొరవతో వడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించారు.

డిజిటల్ తరగతులు

ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించి మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేయాలని రాయపోల్ మండలంలోని పలు పాఠశాలను ఎంపిక చేసి పనులు ప్రారంభించారు. వడ్డేపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో పనులు పూర్తయ్యాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 188 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలో 152 మంది విద్యార్థులు విద్యను అభ్యసి స్తున్నారు. రెండు పాఠశాలలో కూడా ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన కొనసాగుతోంది. పాఠశాలలో టీవీలు అందు బాటులో ఉండడంతో డిజిటల్ తరగతులు కొనసా గిస్తున్నారు.

ఉత్తమ ఫలితాలు

ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తే కార్పొరేట్‌కు దీటుగా మెరుగైన ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. మన ఊరు- మన బడి కార్యక్రమంలో వడ్డేపల్లి పాఠశాలలు ఎంపిక కావడం హర్షణీయం. పాఠశాలల్లో అన్ని రకాల అభివృ ద్ధి పనులు పూర్త య్యాయి. ఏడు సంవత్స రాలుగా పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నాం. ఉత్తమ ఫలితాలు సాధించాం. ఇప్పుడు పాఠశాలలో అన్ని రకాల వసతు లు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందిస్తున్నాం.



– ఎస్ చంద్రయ్య, హెచ్ఎం

చదువుతోనే గుర్తింపు

నేటి ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగితేనే సమాజంలో గొప్ప విలువ, గుర్తింపు వస్తుంది. తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తెచ్చిన వారవుతారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నిలిపింది. విద్యాభివృద్ధి కోసం మన ఊరు- మన బడి కార్యక్రమాన్ని చేపట్టాం. గ్రామంలోని పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశాం. విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు గ్రామానికి పేరు తీసుకురావాలి.



– ఐచ్చు చంద్రశేఖర్, వడ్డేపల్లి సర్పంచ్

ఆరు గ్యారంటీ పథకాలు అందజేస్తాం



నవతెలంగాణ-నంగునూరు

అర్హులైన అందరికీ ఆరు గ్యారెంటీ పథకాలు అందిస్తామని నంగునూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తప్పెట శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ సభలు పెట్టి ప్రజలకు అవగాహన కల్పించి దరఖాస్తులు తీసు కోవడం జరుగుతుందన్నారు. కొత్త రేషన్ కార్డు,గృహజ్యోతి, మహాలక్ష్మి, చేయూత,గృహలక్ష్మి,ఇందిరమ్మ ఇళ్ళు,500లకే గ్యాస్ సిలిండర్, వంటి పథకాలను అర్హులైన వారికి అందజేస్తామన్నారు. ప్రతి పేదవాడికి న్యాయం జరుగుతుందన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు .కాంగ్రెస్ పార్టీ చెప్పిన విధంగా 100 రోజులు లోపు అన్ని పథకాలను అమలు చేస్తామన్నారు.

మృతురాలి కుటుంబానికి అర్థికసాయం



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన కుమ్మరి సత్తమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, అర్థికసాయం అందజేశారు. ఆయన వెంట చెక్కలి రాములు, జుట్టు సుధాకర్, మేకల శ్రీనివాస్, బోయిని లక్ష్మణ్, కుమ్మరి రాజు, రమేష్, తదితరులున్నారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు



నవతెలంగాణ-గజ్వేల్

అక్టోబర్‌లో మేడ్చల్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలలో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబర్ 21 నుంచి 24 తేది వరకు జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే 29వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి పోటీలకు పదవ తరగతి విద్యార్థినిలు రజిని, వైష్ణవి తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల స్పెషల్ ఆఫీసర్ అనురాధ పీఈటీ జ్యోతి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

నేడు జిల్లాస్థాయి టెక్ ఫేస్ట్

నవతెలంగాణ-నంగునూరు

మండలం రాజగోపాల్ పేట గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జిల్లా స్థాయి సృజన టెక్ ఫెస్ట్-2023న కంప్యూటర్ సైన్స్, అనుబంధ ఇంజనీరింగ్ విభాగంలో నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ తెలిపారు. ఈ పరీక్షల్లో గవర్నమెంట్ పాలిటెక్నిక్ రాజ గోపాలపేట, జోగిపేట మహిళా కళాశాల, మెదక్ మహిళా కళాశాల, చినకోడూర్ మహిళా కళాశాలలు పాల్గొననున్నారు. ఉత్తమ ప్రాజెక్ట్‌లను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపించనున్నామన్నారు.

మెదక్ పార్లమెంటు స్థానంపై వంటేరు దృష్టి

- పరిశీలనలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి పేర్లు







నవతెలంగాణ-గజ్వేల్

త్వరలోనే జరుగునున్న పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ స్థానంపై తెలంగాణ ఫారెస్ట్ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు గజ్వేల్ అసెంబ్లీ స్థానం నుండి కెసిఆర్ పోటీ చేయకపోతే తనకు అవకాశం ఇవ్వాలని అప్పటి మంత్రులు కేటీఆర్, హరీష్‌రావుల దృష్టికి తీసుకుపోయారు. ఈ విషయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం ఉంటుందని వారు చెప్పుకొచ్చారు. తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయిన గజ్వేల్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గెలుపు కోసం వంటేరు ప్రతాప్ రెడ్డి రాత్రింబవళ్లు కష్టపడి కృషి చేశారు. నియోజకవర్గంలో పట్టున్న నాయకుడిగా వంటేరు ప్రతాప్ రెడ్డికి గుర్తింపు ఉంది. మెదక్ పార్లమెంటు పరిధిలో గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట, మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్చెరువు నియోజకవర్గాలు ఉన్నాయి. గత శాసనసభ ఎన్నికల్లో మెదక్ మినహా 6 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. మెదక్‌లో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావు గెలుపొందారు. మెదక్ పార్లమెంటు స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి రంగంలో నిలిపితే గెలిచే అవకాశం మెండుగా ఉంటుందని గత అసెంబ్లీ అభ్యర్థుల గెలుపు ఓట్లను బట్టి తెలుస్తుంది. 25 సంవత్సరాలుగా ప్రజలకు సేవ చేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డికి పార్లమెంటులో అవకాశం ఇవ్వాలని నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు బలంగా కోరుతున్నారు. నర్సాపూర్ టికెట్ విషయంలో సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్ రెడ్డికి కాకుండా మాజీ మంత్రి సునీతాలక్ష్మారెడ్డికి ఇవ్వడంతో మదన్ రెడ్డికి మెదక్ పార్లమెంట్ స్థానం ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. మదన్ రెడ్డి రెండుసార్లు ఎమ్మెల్యే అవకాశం ఇచ్చినందున ప్రతాప్‌రెడ్డికి మెదక్ పార్లమెంట్ స్థానం ఇవ్వాలని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకుపోయే అవకాశం ఉంది. ఈ విషయంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులు కెసిఆర్‌ను ఒప్పించాలని స్థానిక నేతలు విజ్ఞప్తి చేస్తున్నారు. గజ్వేల్ అసెంబ్లీ స్థానానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజీనామా చేస్తారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. గజ్వేల్ అసెంబ్లీ స్థానం నుండి గెలుపొందిన కేసీఆర్ ఎమ్మెల్యేగా ఉండి శాసనస భాపక్ష నేతగా ఎన్నికైన సందర్భంగా పదవికి రా జీ నా మా చేయకపోవచ్చని పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఒకవేళ గజ్వేల్ అసెంబ్లీ స్థానానికి రాజీనామా చేస్తే ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఉంది. ఉప ఎన్నికల్లో గజ్వేల్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రంగంలో వంటేరు ప్రతాప్ రెడ్డికి ఇచ్చే అవకాశం ఉంటుందని ఆయన వర్గీయులు గట్టిగా నమ్ముతున్నారు. మెదక్ పార్లమెంట్ నుండి ముగ్గురిలో ఎవరు పోటీ చేస్తారో వారం రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



ముగ్గురిలో ఎవరు పోటీ చేస్తారో!

మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇందులో మదన్ రెడ్డి నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. 2023 ఎన్నికల్లో మాజీ మంత్రి సునీత లక్ష్మారెడ్డికి అవకాశం ఇవ్వడం వల్ల మదన్ రెడ్డికి టికెట్ కావా లని కెసిఆర్‌ను గట్టిగా అడిగారు. మెదక్ పార్లమెంట్ స్థానం ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అధి కారం లేకపోవడం వల్ల మదన్ రెడ్డికి అవకాశం దక్కక పోవచ్చని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత 25 సంవ త్సరాల నుండి రాజకీయాల్లో ఉన్న ప్రతాప్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని నియోజకవర్గ ముఖ్యమైన నేతలు కోరుతు న్నారు. రాజకీయ సమీకరణ మూలంగా కేసీఆర్ కూడా పోటీ చేసే అవకాశం ఉందని అందరూ భావిస్తు న్నారు. మెదక్ పార్లమెంటు స్థానం నుండి ఎవరిని రంగంలో ఉంచితే బాగుంటుందని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు చర్చిస్తున్నట్లు తెలిసింది. మద న్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి ఇద్దరు బలమైన వ్యక్తులే కావడం వల్ల కెసిఆర్ నిర్ణయం ఫైనల్‌గా ఉంటుందని చర్చ జరుగుతోంది.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-మద్దూరు

కొండాపూర్ మాజీ సర్పంచ్ కొయ్యడ భీమయ్య సతీమణి ఇటీవల మృతి చెందారు. మృతురాలి కుటుంబ సభ్యులను లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంగ్రెస్ నేత గుగులోతు భాస్కర్ నాయక్, ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ రాష్ట్ర కార్యదర్శి కపూర్ నాయక్‌లు బుధవారం పరామర్శించారు. వారి వెంట సర్పంచ్ బానోతు సంతోష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ అక్కన్నపేట్ మండల సీనియర్ నాయకులు బానోతు మోహన్ నాయక్, కొండాపూర్ ఆటో యూనియన్ నేత రాజు, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

22న విపంచిలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు

నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లా స్థాయి యువజనోత్సవాలు-2024ను 22న ఉదయం 10.30 గంటలకు విపంచి కళా నిలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి జె. నాగేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన సర్వీసుల శాఖ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ యువజనోత్సవాల్లో జానపద నృత్యం (గ్రూప్), జానపద నృత్యం సోలో, జానపద గీతము (గ్రూప్), జానపద గీతం సోలో, లైఫ్ స్కిల్ కాంపోనెంట్‌లో స్టోరీ రైటింగ్, పోస్టర్ మేకింగ్, ప్రకటన, ఫోటోగ్రఫీ పోటీలు ఉంటాయని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్ 7780577861లో సంప్రదించాలని ఆయన సూచించారు.

అడ్వంచర్ శిబిరానికి ఎంపికైన విద్యార్థి అగస్టిన్



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్దిపేట ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్ బి.ఎస్సి తృతీయ సంవత్సరం చదువుతున్న బి. ఆగస్టిన్ జాతీయ స్థాయిలో జరిగే అడ్వెంచర్ శిబిరానికి ఎంపికయ్యారు. ఈ నెల 23 నుంచి జనవరి 1వ తేది వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగే నేషనల్ అడ్వెంచర్ శిబిరానికి హాజరు కానున్నారని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు సిహెచ్ మధుసూదన్, బి.కృష్ణయ్యలు తెలిపారు. ఈ శిబిరంలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు సంబంధించిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొంటారని, ఈ శిబిరం ద్వారా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లలో ఆత్మస్థైర్యాన్ని, మనోబలాన్ని, లీడర్షిప్ లక్షణాలు నేర్చుకుంటారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. హెచ్. ప్రసాద్ తెలిపారు. అడ్వంచర్ శిబిరానికి ఎంపికైన అగస్టిన్‌ని ఆయన అభినందించారు.

రాజీనామా యోచనలో బీఆర్ఎస్ నాయకులు?

నవతెలంగాణ-బెజ్జంకి

అసంతృప్తితో పలువురు బీఆర్ఎస్ నాయకులు రాజీనామా యోచనలో ఉన్నట్టు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బుధవారం తెలిపారు. శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం శాయశక్తులా కృషి చేశామని, ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ నాయకత్వం మహిళ సర్పంచులను, నాయకులను విస్మరించారని, దీంతో అసంతృప్తికి గురై రాజీనామా బాట పడుతున్నట్టు బీఆర్ఎస్ నాయకుడు వెల్లడించారు.

సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్‌ను పునరుద్ధరించాలి



నవతెలంగాణ-సిద్దిపేట

సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్ 1976ను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించి, కాపాడాలని తెలంగాణ మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, కిరణ్‌లు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో రిప్రజెంటేటివ్స్ బుధవారం సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ హక్కు చట్టబద్ధమైన పని విధానాలను రూపొందించాలని, మెడికల్ రిప్రజెంటేటివ్స్ ప్రభుత్వ ఆసుపత్రులలో, ఇనిస్టిట్యూషన్స్‌లో పనిచేసుకునేందుకు ఉన్న అడ్డంకులు తొలగించాలన్నారు. ఆ పని చేసుకోవటం మెడికల్ రిప్రజెంటేటివ్ హక్కుగా గుర్తించాలని కోరారు. మందులు, మందుల పరికరాలపై ఉన్న జీఎస్టీని తొలగించాలని డిమాండ్ చేశారు. మందుల ధరలు తగ్గించాలని, డేటా యొక్క గోప్యతను కాపాడాలని, యాజమాన్యాలు అమ్మకాల ఒత్తిడి గురించి మెడికల్ రిప్రజెంటేటివ్స్ ను వేధించవద్దని, బలి చేయవద్దని, ట్రాకింగ్ పరికరాల ద్వారా వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించవద్దన్నారు. పనిచేసే ప్రదేశాలలో ఎటువంటి అడ్డంకులు లేకుండా పనిచేసుకునే వెసులబాటు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, రష్యా, రవి , భరత్, శివకుమార్, బాలకిషన్, రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ



నవతెలంగాణ-గజ్వేల

నరేంద్ర మోడీ ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నారని యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్ ఖాన్ ఆరోపించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దేశ అత్యున్నత పార్లమెంటుకే రక్షణ కల్పించడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మోదీ దేశాన్ని ఏ విధంగా రక్షిస్తారని ఆయన ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో బీజేపీ ఓటమి చెందడం ఖాయమన్నారు. ఫేక్ వీడియోలను బీజేపీ వాళ్ల సృష్టిస్తే దానిని తెలంగాణలో బీఆర్ఎస్ నాయకులు వైరల్ చేస్తున్నారన్నారు. గత పది సంవత్సరాల తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై శ్వేత పత్రం విడుదల చేస్తామంటే బీఆర్ఎస్ నాయకులు సన్నాయి నొక్కులు చేశారని ఆయన విమర్శించారు.

బిగ్‌బాస్ 7 విజేతను అభినందించిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-తొగుట

బిగ్ బాస్ 7 విజేతగా పల్లవి ప్రశాంత్ విజయం సాధించడం అభినందనీయమని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి అన్నారు. బుధవారం బిగ్ బాస్ విజేత, కొల్గూర్ రైతు బిడ్డ పల్లవి ప్రశాంత్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట పాతుకుల బాలేష్ తదితరులు ఉన్నారు.